ఆంధ్రజ్యోతి 3 ప్రకాశం
శుక్రవారం 28, మార్చి 2025


ప్లాంట్ ఏర్పాటు చేసే భూమిలో డ్రిల్లింగ్ మిషన్ ద్వారా కొండ రాళ్లను తొలగిస్తున్న వర్కర్లు

పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్న ఎక్స్‌కవేటర్ లారీలు, యంత్రాలు

పరిశ్రమ పండుగ

మాఊళ్లకు మంచి రోజులొచ్చాయి..!

- చిగురిస్తున్న పశ్చిమప్రాంత ప్రజల ఆశలు
- రాష్ట్రానికే తలమానికంగా బయోగ్యాస్ ప్లాంట్
- శంకుస్థాపనకు వేగంగా జరుగుతున్న ఏర్పాట్లు
- దగ్గరుండి పనులను సమీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
- పీసీపల్లి ప్రజల్లో ఆనందం
- వచ్చే నెల 2వ తేదీన మంత్రి లోకేష్, అనంత్ అంబానీ రాక

ఇప్పటివరకూ చూడని పెద్దపెద్ద కార్లతో, ప్రముఖుల రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది. 'రయ్‌రయ్'మంటూ అధికార యంత్రాంగం సైతం పరుగులు పెడుతోంది. ఊళ్లకు మంచి రోజులొచ్చాయని కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండల వాసుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇంతకు విషయం ఏంటంటే... రాష్ట్రంలో తొలిసారిగా పశ్చిమ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం కీలక ప్రాజెక్టును మంజూరు చేసింది. ప్రముఖ పారిశ్రామిక సంస్థ రిలయన్స్ ఆధ్వర్యంలో వెంగళాయపల్లి పంచాయతీ పరిధిలోని దివాకరపల్లి సమీపంలో కంప్రెస్‌డ్ ఇంటిగ్రేటెడ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కానుంది. అందుకోసం దాదాపు 2వేల ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటికే 1200 ఎకరాలను అధికారులు గుర్తించి సిద్ధం చేస్తున్నారు. అందులో దాదాపు రూ.130 కోట్లకు పైగా వెచ్చించి ఆయా భూమిలో 6 ప్లాంట్‌ల ఏర్పాటు కోసం పనులు వేగంగా చేపట్టారు.

కనిగిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశ్చిమప్రాంతంలో అత్యంత వెనుకబాటుకు గురైన కనిగిరి నియోజకవర్గాన్ని పారిశ్రామిక కేంద్రంగా మార్చేందుకు అడుగులు పడుతున్నాయి. అందులో భాగంగా తొలిసారి అతిపెద్ద సంస్థ రిలయన్స్ సంస్థ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు రావటం విశేషం. ఇది శుభపరిణామంగా అటు రాజకీయ విశ్లేషకులు, ఇటు కనిగిరి ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటులో ఎమ్మెల్యే చొరవ, కృషితోపాటు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సహకారం ఎంతో ఉంది. ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా కనిగిరిలో పర్యటించిన మంత్రి లోకేష్ నియోజకవర్గంలో ప్రధానంగా ప్రజలు వలస జీవితాలతో మగ్గుతున్నట్లు గుర్తించారు. సరైన వర్షాలు, భూగర్భ జలాలు లేక వ్యవసాయం పూర్తిగా కుంటుపడిపోయిందని, ప్రజలకు వలస బాటే శరణ్యంగా మారిందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర లోకేష్‌కు విన్నవించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే భూములన్నీ సస్యశ్యామలం అవుతాయని, పరిశ్రమలు ఏర్పాటైతే ఉపాధి లభించి ప్రజల వలసలు ఆగుతాయని లోకేష్ గుర్తించారు. వెలిగొండ పూర్తయ్యేలోపు పరిశ్రమల స్థాపన కూడా జరిగితే ప్రజలకు మేలు చేకూరుతుందని భావించిన లోకేష్ రాష్ట్రంలో కనిగిరి ప్రాంతంలోనే బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.


భూమిని చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్లు

అనంత్ అంబానీ, లోకేష్ రాక

రిలయన్స్ లాంటి పెద్ద పారిశ్రామిక సంస్థ కనిగిరి ప్రాంతంలో ప్లాంట్ ఏర్పాటుతో పాటు ఏప్రిల్ 2న జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి ముఖేష్ అంబాని కుమారుడు అనంత్ అంబానితోపాటు మంత్రి లోకేష్‌తోపాటు వస్తున్నారు. ఇక్కడ నిమ్జ్ పరిశ్రమ ఏర్పాటు, ఇతర సోలార్ లేదా పునరుత్పాదన ఇంధనంతో కూడిన ప్లాంట్ ఏర్పాటుకు సుగమంగా మారుతుందని చర్చ జరుగుతోంది. కనిగిరి ప్రాంతంలో ప్లాంట్ ఏర్పాటుకు 475 ఎకరాలు కేటాయించగా, ఇంకా విస్తరణ పనులు జరిగే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.

పశ్చిమ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురింపు

కనిగిరి ప్రాంతంలో దశాబ్దకాలంగా అభివృద్ధి కుంటుపడిందనే చెప్పాలి. ఆ కొద్దిపాటి అభివృద్ధి కూడా టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే జరిగింది. అప్పట్లో నిమ్జ్ ఏర్పాటు కాబోతుందని ప్రజలు బాగా నమ్మారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అది ఆలస్యం కావటంతో అందరూ మదనపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే పారిశ్రామిక సంస్థలు కనిగిరి ప్రాంతంలో ఏర్పాటుకు అడుగులు వేశాయి. అందులోభాగంగా బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతున్నాయి. ఎంతోమందికి ఉపాధితోపాటు రైతుల భూములు వినియోగంలోకి వచ్చి ఆదాయం తెచ్చేపెట్టే మార్గం ఏర్పడింది.

శరవేగంగా విద్యుత్ లైన్ల పనులు

శంకుస్థాపనకు సిద్ధం కాబోతుండటంతో ఆ ప్రాంతానికి వెలుగులొచ్చాయి. దివాకరపల్లి నుంచి నాలుగు కిలోమీటర్ల మేర పెద్ద పెద్ద విద్యుత్ స్తంభాలు వేసి పనులు చేపడుతున్నారు. రెండు త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా రాత్రింబవళ్లు పనులు చేసేందుకు అవసరమైన వెలుతురు కోసం బిగించిన ఫ్లడ్ లైట్‌లకు ప్రత్యేకంగా మరో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వేగంగా జరుగుతున్న పనులను చూస్తున్న ప్రజలు తమకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ఏర్పాటు చేస్తున్న త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లు

ప్రముఖుల రాకతో సందడే సందడి

పీసీపల్లి మండలంలోని వెంగళాయపల్లి పంచాయతీలో దివాకరపల్లి సమీపంలో ఏర్పాటయ్యే బయోగ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన కోసం పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో నాయకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పెద్ద, పెద్ద కార్లు, వాహనాలలో నిత్యం తిరుగుతుండటంతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. కనిగిరి నుంచి పీసీపల్లి మండల కేంద్రానికి 25 కి.మీ ఉంది. అక్కడి నుంచి దివాకరపల్లి వరకు 4 కి.మీ, అక్కడి నుంచి ప్లాంట్ ఏర్పాటు చేసే భూమి వద్దకు మరో 4కి.మీ ఉంటుంది. దీంతో మొత్తం 33 కి.మీ నిత్యం వాహనాల రాకపోకలు పెరిగాయి. మారుమూల ప్రాంతంగా ఉన్న పీసీపల్లికి ఇటీవలి వరకు చెప్పుకోదగ్గ వాహన రాకపోకలు జరగలేదు. ప్రస్తుతం బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుతో శరవేగంగా పనులు జరుగుతుండటంతో ప్రముఖులు వచ్చిపోతుంటే ఆయా ప్రాంత ప్రజల్లో ఆనందంతోపాటు గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.


దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

అర్హత ఉన్న వారందరికీ రుణాలివ్వాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



ఒంగోలు కలెక్టరేట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కేవలం లక్ష్యాలకు పరిమితం కాకుండా.. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన అందరికీ రుణాలు ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో గురువారం జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి సంబంధించి రుణ పంపిణీపై సమీక్ష చేసి దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పశుపోషణ, మత్స్య, వ్యవసాయ ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు ఎక్కువ అవకాశాలు ఉన్నందున పెద్దఎత్తున రుణాలు ఇవ్వాలన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్త రావాలన్నది సీఎం లక్ష్యమని, ఈ దిశగా ప్రభుత్వ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని రుణాలు మంజూరుచేయాలని చెప్పారు. ఎల్‌డీఎం రమేష్ మాట్లాడుతూ పరిశ్రమలు, అనుబంధ రంగాలకు ఈ వార్షిక ప్రణాళికలో 2024 డిసెంబరు 31 నాటికి 91.99 శాతం సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు 88.72శాతం రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలోని స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి నాలుగు రెట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. డీఆర్‌డీఏ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు 83శాతం రుణాలు ఇచ్చామని, మహిళా పారిశ్రామికవేత్తలకు 71శాతం రుణాలు ఇచ్చామన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాల మంజూరుకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ దరఖాస్తుదారులకు సాంకేతిక కారణాలను చూపిస్తూ రుణాల మంజూరులో జాప్యం చేయవద్దన్నారు. సమావేశంలో ఆర్‌బీఐ అధికారి రోహిత్ అగర్వాల్, నాబార్డు డీడీఎం రవికుమార్, డీపీవో శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు శ్రీనివాసరావు, నారాయణ, శ్రీనివాసప్రసాద్, సుజన్‌కుమార్, అర్చన, ధనలక్ష్మి, అర్జున్‌నాయక్, రవితేజ, రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, రఘునంద పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు

- త్రిపురాంతకం ఎంపీపీ, పుల్లలచెరువు వైస్ ఎంపీపీపై చివరి వరకు ఉత్కంఠ
- అన్ని పదవులను నిలబెట్టుకున్న వైసీపీ.. పోలీసుల భారీ బందోబస్తు

మార్కాపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మార్కాపురం డివిజన్‌లో గురువారం పలుచోట్ల మండల పరిషత్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. త్రిపురాంతకం మండలానికి సంబంధించి నాలుగు రోజుల క్రితం చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు, ఎంపీటీసీ సభ్యులను మినహా కార్యాలయాల్లోకి ఎవరినీ అనుమతించలేదు. ముందుగా అనుకున్నట్లుగానే అన్నిచోట్ల వైసీపీ వర్గీయులే గెలుపొందారు. త్రిపురాంతకం ఎంపీపీ, పుల్లలచెరువు వైస్ ఎంపీపీ ఎన్నికలకు సంబంధించి సంఖ్యాబలం సమానంగా ఉండటంతో చివరి వరకు ఉత్కంఠ రేపాయి. మార్కాపురం ఎంపీపీ ఎన్నికకు సంబంధించి ఒక్కరే బరిలో నిలవడంతో ఏకగ్రీవమైంది. ఎర్రగొండపాలెంలో కోఆప్షన్ సభ్యుని ఎన్నిక జరిగినా మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు వైసీపీకే ఉన్నారు. దీంతో అక్కడ కూడా వైసీపీ వర్గీయులే ఎన్నికయ్యారు. ఎన్నికైన అనంతరం కూడా ఎక్కడా ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ గట్టి చర్యలు చేపట్టింది.


వైపాలెం కోఆప్షన్ సభ్యుడిగా నియామకపత్రం అందుకుంటున్న సయ్యద్‌సాదిక్

చివరి వరకు ఉత్కంఠ

త్రిపురాంతకం ఎంపీపీ, పుల్లలచెరువు వైస్ ఎంపీపీలకు సంబంధించి చివరి వరకు ఉత్కంఠ కొనసాగింది. త్రిపురాంతకం మండలంలో మొత్తం 18 మంది ఎంపీటీసీలు ఉన్నారు. అప్పట్లో 17 మంది వైసీపీ, ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నారు. ఆళ్ల ఆంజనేయరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదై జైల్లో ఉండటంతో 17 మందే ఎన్నికల్లో పాల్గొన్నారు. వారిలో తొమ్మిది మంది ఆళ్ల సుబ్బమ్మకు మద్దతు తెలిపారు. మిగిలిన ఎనిమది మంది వైసీపీ రెబల్ అభ్యర్థికి మద్దతు తెలిపారు. దీంతో ఒక్క ఓటు తేడాతో ఆళ్ల సుబ్బమ్మ ఎంపీపీగా ఎన్నికయ్యారు. అదేవిధంగా పుల్లలచెరువు మండలానికి సంబంధించి మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా గతంలో 11 మంది వైసీపీ నుంచి, 4 టీడీపీ నుంచి గెలుపొందారు. వైసీపీకి చెందిన మరో ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు ప్రస్తుతం టీడీపీలో చేరారు. దీంతో వైసీపీ 8, టీడీపీకి 7 మంది ఎంపీటీసీ సభ్యుల బలం ఉంది. కానీ గురువారం జరిగిన వైస్ ఎంపీపీ ఎన్నికకు గంగవరం ఎంపీటీసీ కోట్ల నర్సమ్మ గైర్హాజరయ్యారు. దీంతో బలం చెరిసగంగా మారింది. చివరికి టాస్ వేయడంతో వైసీపీకి చెందిన లింగంగుంట రాములును విజయం వరించింది. ఎర్రగొండపాలెంలో కోఆప్షన్ సభ్యుని ఎన్నికకు సంబంధించి మొత్తం 18 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను 10 మంది వైసీపీకి, ఎనిమిది మంది టీడీపీకి మద్దతు తెలపడంతో షేక్ సాదిక్ ఎన్నికయ్యారు. మార్కాపురం మండల పరిషత్తుకు సంబంధించి ముందుగా అనుకున్నట్లుగానే తిప్పాయిపాలెం ఎంపీటీసీ సభ్యురాలు బండి లక్ష్మీదేవి ఒక్కరే బరిలో నిలవడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కార్గో సేవలు అట్టర్ ఫ్లాప్..!

- గంటల కొద్దీ పడిగాపులు..
- ఒంగోలులో సమాధానం చెప్పేవారు కరువు
- నాడు నెలకు రూ.45లక్షల వరకు ఆదాయం
- నేడు రూ.10 లక్షలకు పడిపోయిన వైనం
- సిబ్బంది ఇష్టారాజ్యమే కారణం



ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆర్టీసీ.. ఆదాయ వనరుల పెంపుకోసం ఏర్పాటు చేసిన కార్గో కొరియర్ సేవలు అస్తవ్యస్తంగా మారాయి. మొదట్లో నెలకు రూ.45 లక్షల వరకు ఆదాయం ఉండగా, నేడు రూ.10లక్షలు కూడా రాని పరిస్థితులకు దిగజారిపోయింది. ముఖ్యంగా సిబ్బంది నిర్లక్ష్యం, జవాబుదారీతనం లేకపోవడం, పైనుంచి పర్యవేక్షణలోపం తోడు కావడంతో సేవలు మొక్కుబడిగా మారాయి.

పడిపోయిన ఆదాయం

ఒంగోలుడిపో ఆవరణలో ఉన్న కార్గో కార్యాలయంలో పూర్తిగా ప్రైవేటు సిబ్బంది ఉండటంతో వారిపై అజమాయిషీ కొరవడింది.మొదట్లో మార్కెటింగ్ చేసేందుకు ఆర్టీసీ ఉద్యోగుల్లోని ఐదుగురిని నియమించారు. ప్రస్తుతం మార్కెటింగ్ సేవలు నిలిపివేయడంతో ఆదాయవనరులు మరింత తగ్గిపోయాయి. ఒకప్పుడు ప్రజలకు సులభతరంగా అందిన కార్గో సేవలు ఇప్పుడు మొక్కుబడిగా మారాయి. ఒక్కో బుకింగ్‌కు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. అలాగే పార్శిళ్లను తీసుకునేందుకు వచ్చిన కస్టమర్లకు సమాధానం చెప్పేవారే కరువయ్యారు.

డోర్ డెలివరీ సేవలు నిల్

వాస్తవానికి వివిధ పార్శిళ్లను ఇంటి వద్దకే అందించాల్సి ఉంది. అందుకోసం ప్రతి పార్సిల్‌కు బరువు ఆధారంగా ధరలు నిర్ణయించారు. 1 కేజీ వరకు రూ.18 వసూలు చేయగా, 1 నుంచి 6 కేజీల వరకు రూ.30, 6 కేజీల నుంచి 10 కేజీల వరకు రూ.36, 10 కేజీల నుంచి 25 కేజీల వరకు రూ.48, 25 కేజీల నుంచి 50 కేజీల వరకు రూ.59 వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ సదుపాయం 50 కేజీల బరువు గల పార్శిల్‌కు ఎంపికచేసిన నగరాల పరిధిలో 10 కిలోమీటర్ల దూరంలోనే అందించేలా చర్యలు చేపట్టారు. నేటికి ఒక్క ఇంటికి కూడా సర్వీసులు లభించలేదంటే ఆశ్చర్యం వేయక తప్పదు.

డిపో మేనేజర్లతో నేడు ఆర్టీసీ ఈడీ సమీక్ష

ఒంగోలులోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఫ్రీపార్కింగ్ లేదు. ప్రతిరోజు వేలసంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నా తాగునీరు అందుబాటులో లేదు. అసలే వేసవి కాలం కావడంతో తాగునీరు లేకపోవడం పట్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నెల్లూరు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్ శుక్రవారం ఒంగోలు జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. సమావేశానికి జిల్లాలోని డిపో మేనేజర్లు, ఆర్టీసీ ట్రాఫిక్ సీఐలు, గ్యారేజ్ అధికారులు హాజరుకానున్నారు. సమస్యలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి ఉంది.


పెట్లూరు గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను అందజేస్తున్న మంత్రి స్వామి

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
- కొండపి మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు చెత్త సేకరణ ట్రాక్టర్లు అప్పగింత

గ్రామాల పరిశుభ్రతే ప్రభుత్వ లక్ష్యం

కొండపి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : చెత్త రహిత, ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామ పంచాయతీలలో చెత్త సేకరించేందుకు మంజూరైన 18 ట్రాక్టర్లను స్వామి గురువారం సాయంత్రం కొండపి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనుల పూర్తి బాధ్యతను సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తీసుకోవాలన్నారు. చెత్త రహిత గ్రామాలుగా మండలాన్ని తీర్చిదిద్దాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో జి.వెంకటనాయుడు, ట్రాక్టర్లు మంజూరైన గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

గోల్డెన్ గ్రానైట్‌కు అనుకూలంగా హైకోర్టు తీర్పు

సింగిల్ జడ్జి తీర్పుని కొట్టివేసిన ద్విసభ్య ధర్మాసనం

మైనింగ్ కార్యకలాపాలకు తొలగిన అడ్డంకులు

చీమకుర్తి, మార్చి27(ఆంధ్రజ్యోతి) : గోల్డెన్ గ్రానైట్ మైనింగ్ రెన్యువల్ లీజును రద్దు చేస్తూ సింగిల్‌జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ గురువారం హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పు గోల్డెన్ గ్రానైట్‌కు అనుకూలంగా రావటంతో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించుకోవటానికి అడ్డంకులు తొలగిపోయాయి. మండలంలోని ఆర్ఎల్‌పురంలోని సర్వేనంబర్ 55/6లో గోల్డెన్ గ్రానైట్స్‌కు మైనింగ్ లీజును పునరుద్ధరిస్తూ 2022 ఆగస్టు 17న గనులశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా వీటిని రద్దు చేయాలంటూ బీఏఎస్ గ్రానైట్‌కు చెందిన అశ్వత్థనారాయణ, సురేష్‌కుమార్‌లు 2022లో హైకోర్టులో వాజ్యం దాఖలు చేశారు. దీనిపై 2025 ఫిబ్రవరి 21న హైకోర్టు సింగిల్ బెంచి జడ్జి మైనింగ్ పునరుద్ధరణ లీజును రద్దు చేస్తూ తీర్పునిచ్చారు. దీనిపై గోల్డెన్ గ్రానైట్ సంస్థ హైకోర్టు ద్విసభ్య జడ్జి ధర్మాసనానికి అప్పీల్ చేయగా విచారణ జరిపిన తదుపరి గురువారం సింగిల్‌జడ్జి తీర్పును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. మైనింగ్ లీజు పునరుద్ధరిస్తూ డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల అమలులోకి రాగా కార్యకలాపాలు నిర్వహించుకొనే అవకాశం గోల్డెన్ గ్రానైట్‌కు లభించింది.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : మంత్రి



మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎస్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు మంత్రి డాక్టర్ స్వామి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఒంగోలులోని పీఏజీ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన ఇఫార్‌విందులో మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, మేయర్ గంగాడ సుజాతలు ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇమామ్, మౌజామ్‌లకు పెండింగ్ గౌరవ పారితోషకాలను చెల్లించామన్నారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేషు, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి పార్థసారథి, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, కమిషనర్ వెంకటేశ్వరరావు, స్టెప్‌సీఈవో శ్రీమన్నారాయణ, జిల్లామైనార్టీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'నక్ష' సర్వేకు 42 టీములు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆస్తుల డిజిటలైజేషన్‌లో భాగంగా నక్ష సర్వే నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలో జరుగుతున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నక్ష సర్వే పూర్తి చేసేందుకు 42 టీములను నియమించినట్లు తెలిపారు. ఈ సర్వే 45 రోజుల్లో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సర్వే వల్ల ప్రజల ఆస్తులకు రక్షణ ఉంటుందని, అలాగే సరిహద్దు వివాదాలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. నిర్దేశించిన గడువు లోపల సర్వే పూర్తి చేసి నివేదికలు సమర్పించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మూడు విడతలలో రూ.30 కోట్లు ఇన్సెంటివ్ అందజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టీపీవో బాబూరావు, టీపీఎస్ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ యూనిట్లకు రూ.11.02 లక్షల మంజూరు

ఒంగోలు విద్య, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలోని 58 జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) యూనిట్లకు రూ.19వేల చొప్పున రూ.11.02 లక్షలను రిజిస్ట్రార్ బి.హరిబాబు గురువారం విడుదల చేశారు. యూనివర్శిటీ అనుబంధంగా మొత్తం 24 కళాశాలలు ఉన్నప్పటికి గతంలో ఉన్న 58 యూనిట్లకే ప్రస్తుతం నిధులు మంజూరయ్యాయి. ఆయా కళాశాలల బ్యాంకు ఖాతాలకు ఈ నిధులు జమ అయ్యాయి. నిధులు మంజూరైన కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు నిధులు వ్యయం చేసి ఆయా వివరాలను అందజేయాలని రిజిస్ట్రార్ కోరారు. యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్శిటీ కొత్తగా మరో 58 యూనిట్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపామని, వాటికి సంబంధించి మిగిలిన నిధులు ఈనెలాఖరుకు విడుదల అవుతాయని చెప్పారు.

క్విస్ విద్యార్థుల సేవలకు సత్కారం

ఒంగోలు విద్య, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ల్యాబరేటరి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను సత్కరించారు. ఏపీ ఉన్నత విద్యా మండలి, బే కన్సర్వేషన్ డెవలప్‌మెంట్ కమిషన్ యూనిసెఫ్ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ లేబొరేటరీ ఇంటర్న్‌షిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్విస్ ఈసీఈ విద్యార్థులు బి.ప్రత్యూష, డి.కార్తీక్, జి.రవిశంకర్, మెకానికల్ విద్యార్థులు వై.విష్ణువర్థన్, ఆనంద్, హెచ్.నిడమానూరు జడ్పీ హైస్కూలు విద్యార్థులకు ఎలక్ట్రానిక్ డివైజెస్, కాంపొనెంట్, 3డి డిజైనింగ్, మెకానికల్‌కు సంబంధించి శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన క్విస్ విద్యార్థులను విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను క్విస్ విద్యాసంస్థల అధినేత సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్‌చైర్మన్ గాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు అభినందించారు.

మెగా రక్తదాన శిబిరం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి27(ఆంధ్రజ్యోతి) : సినీ హీరో రామ్‌చరణ్ జన్మదినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక వెంకట రమణ నర్సింగ్ హోమ్‌లోని నవ్యబ్లడ్ బ్యాంకులో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముత్యాల కళ్యాణ్, రాహుల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీనాయకుడు కంది రవిశంకర్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌ను కట్ చేశారు. అనంతరం జరిగిన రక్తదాన శిబిరంలో పలువురు అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో చనపతి రాంబాబు, పల్లా ప్రమీల, ఆకుపాటి ఉష, సాయి, సుంకర కళ్యాణి, అశ్వ నారాయణ, నరసింహారావు, నరేష్, పసుపులేటి శ్రీను, వసంతనాయుడు, మనోజ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ బీ పడాయ్ బీ ప్రారంభం

టంగుటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పోషణ్ బీ పడాయ్ బీ కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రారంభించారు. గురువారం ఉదయం తూర్పునాయుడుపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ అధికారిణి పర్యవేక్షణలో ఈవేడుకను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవసేనకుమారి, ఎంఈవో-1 చెంచుపున్నయ్య, సర్పంచ్ రవికుమార్, సూపర్‌వైజర్లు జి.జ్యోతి, సైదాబి, సత్యవతి, కుసుమ పాల్గొన్నారు.

దుష్టశక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

టంగుటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : దుష్టశక్తుల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ చెప్పారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను అధ్యక్షతన గురువారం రాత్రి టంగుటూరు పార్టీ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలోని అందరి దృష్టి పంచాయతీపై ఉందని, అందుకే కొన్ని కుట్రలు అల్లి వాటిని ఆచరణలో పెట్టేందుకు పంచాయతీని వేదికగా చేసుకుంటున్నారని ఆరోపించారు. మక్కెన కోటేశ్వరరావు చదలవాడ చంద్రశేఖర్, బెల్లం జయంత్‌బాబు, బెజవాడ వెంకటేశ్వర్లు, బ్రహ్మానందం, కామని వెంకట్రావు పాల్గొన్నారు.

ఆలకూరపాడు ఉప సర్పంచ్‌గా చిరంజీవి

మండలంలోని ఆలకూరపాడు వైస్ సర్పంచ్ ఎన్నిక గురువారం జరిగింది. వైస్ సర్పంచ్‌గా వై.చిరంజీవి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. టంగుటూరు ఉపసర్పంచ్ ఎన్నిక కూడా ఆగిపోయింది.

ఎక్స్‌కవేటర్, ట్రాలీ సీజ్

మద్దిపాడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోయివారిపాలెం ఇసుకరేవులో ఎక్స్‌కవేటర్‌ను, ట్రాలీని తహసీల్దార్ సుజన్‌కుమార్ గురువారం సీజ్ చేశారు. గుండ్లకమ్మలో సుమారు కిలోమీటర్ పైగా ర్యాంపు నిర్మించి ఇసుక తరలిస్తున్నారని బసవన్నపాలెంకు చెందిన అర్ల వెంకటేశ్వర్లు, పలువురు ఫిర్యాదు చేయగా తహసీల్దార్ తనిఖీ చేసి అక్కడ ఉన్న వాహనాలను సీజ్ చేశారు. ఆయన వెంట ఆర్ఐ రమణయ్య, వీఆర్వో బుల్లయ్య ఉన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

మద్దిపాడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై గురువారం మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి 2024 మార్చి 31వరకు సుమారు రూ.2.21కోట్లతో పనులు చేపట్టినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌ప్రసాద్ చెప్పారు. పలు చోట్ల జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకుంటామని డీపీఎం వెంకటస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో ధనుంజయవర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండపి సీహెచ్‌సీలో నాణ్యమైన వైద్యసేవలు

మంత్రి స్వామి

ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని

వైద్యఆరోగ్యశాఖ సిబ్బందికి ఆదేశం


వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి స్వామి

కొండపి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కొండపి సీహెచ్‌సీలో నాణ్యమైన వైద్యసేవలు అందించాలని మంత్రి డాక్టర్ శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. అలాగే ప్రసవాల సంఖ్య పెరగాలని, చుట్టుపక్కల ఉన్న దాదాపు 50కిపైగా గ్రామాల్లోని గర్భిణులకు సీహెచ్‌సీలో అందుతున్న సేవలపై నమ్మకం పెంచాలన్నారు. నియోజకవర్గంలోని పీహెచ్‌సీల వైద్యులు, సీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కొండపి మండల పరిషత్ సమావేశం హాలులో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపి వైద్యశాలలో ప్రసవాలకు అవసరమైన గైనకాలజిస్టు, మత్తు డాక్టర్‌తోపాటు పరీక్షలు చేసేందుకు అవసరమైన సాంకేతిక, యాంత్రిక వసతులన్నీ ఉన్నాయని చెప్పారు. రోగులకు మెరుగైన సేవలతోపాటు, రోగులకు నమ్మకం కలిగించాలని సీహెచ్‌సీ ఇన్‌చార్జి అధికారి వరలక్ష్మికి సూచించారు. ప్రస్తుతం జిల్లా స్థాయి అధికారులుగా ఉన్న డీఎంహెచ్‌వో పి.వెంకటేశ్వర్లు, డీసీఎస్ సూరిబాబు కూడా మత్తు వైద్యులని, అవసరమైతే వారు కూడా కొండపి వచ్చి వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సింగరాయకొండ ఆస్పత్రి స్థాయిని కూడా పెంచుతామని మంత్రి హామీ ఇచ్చారు.

ఆశాలకు రూ.1000..

కొండపి సీహెచ్‌సీకి ప్రసవం కోసం గర్భిణిని సిఫార్సు చేసి, వైద్యశాలలో కాన్పు చేయిస్తే ఆశా కార్యకర్తకు ఒక్కొక్క గర్భిణికి వెయ్యి రూపాయల చొప్పున దాతల నుంచి పారితోషికం ఇప్పిస్తానని మంత్రి స్వామి చెప్పారు. ఇలా కొండపి సీహెచ్‌సీకి సిఫార్సు చేసిన 200 ప్రసవాలకు ఆశాలకు రూ2లక్షల ఇస్తానని, పేదలకు సాయం అందించేందుకు తమ పార్టీ నాయకులు డబ్బులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, మీరు సిద్ధంగా ఉండాలని చెప్పారు.

ఏసీలు కూడా మాయం చేశారే..

సమావేశం జరుగుతున్నపుడు ఎండవేడికి వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతుండటాన్ని గమనించిన మంత్రి స్వామి.. ఏసీలు ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించారు. మొత్తం మూడు ఏసీల్లో రెండు ఉండటం, అవి పనిచేయకపోవడం మరో ఏసీ లేకపోవడాన్ని గమనించిన మంత్రి నేనిచ్చిన ఏసీలను మాయం చేశారే.. సమావేశం నిర్వహించుకోవడానికి అనువుగా ఉందని ఇక్కడ పెడితే ఏసీలు లేకుండా ఇబ్బందులు పెట్టారే.. అని అసహనం వ్యక్తం చేశారు. ఏసీలు రిపేరు చేయించాలని ఎంపీడీవో రామాంజనేయులుకు సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీసీఎస్ సూరిబాబు, ఆర్థోపెడిక్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులకు వివాహిత బలి

హైదరాబాద్‌లో మృతి

ఒంగోలులో కేసు నమోదు

హత్య చేశారని తల్లిదండ్రుల ఆరోపణ


భర్త రవితో వాసంతి (ఫైల్)

ఒంగోలు క్రైం, మార్చి27(ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపులకు వివాహిత బలి అయింది. ఈ సంఘటన బుధవారం రాత్రి హైదరాబాద్‌లో జరగగా గురువారం ఒంగోలులో తాలుకా పోలీసులు కేసు నమోదు చేశారు. బల్లికురవ మండలం పొత్తూరు చెందిన సోమిశెట్టి వాసంతి(28), ఒంగోలు నగరం శ్రీనివాసనగర్‌కు చెందిన పగిడి రవి మూడేళ్ళ క్రితం ప్రేమించుకున్నారు. వారిది ఒకే కులం కావడంతో పెద్దలు అంగీకరించి పెళ్లి చేశారు. వారికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. వారు హైదరాబాద్ బీరంగూడాలో కాపురం పెట్టారు. అయితే ఏడాది క్రితం నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన రవి జాబ్ చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. అప్పటి నుంచి వాసంతికి వేధింపులు మొదలయ్యాయి. అటు అత్తమామలు, ఇటు భర్త రవి నిత్యం వేధింపులు చేస్తున్నారని వాసతి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇదే సమయంలో బుధవారం కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరగ్గా వాసంతి తన తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. అయితే రాత్రి 12 గంటల తరువాత రవి వాసంతి తండ్రికి ఫోన్ చేసి మీ అమ్మాయి ఉరేసుకుని మృతి చెందిందని తెలిపారు. తెల్లవారే సరికి ఆమె మృతదేహాన్ని ఒంగోలులోని రవి ఇంటికి చేర్చారు. అయితే వాసంతి శరీరంపై గాయాలు ఉన్నట్లు గుర్తించిన తల్లిదండ్రులు తాలుకా పోలీసులను ఆశ్రయించి తన కుమార్తెను హత్య చేశారని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గృహ హింస కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తాలుకా సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. హైదరాబాద్‌లో వాసంతి మృతిపై అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేయకుండా ఒంగోలు తీసుకురావడం ఏమిటని మృతురాలి బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పెరిదేపి ఉపసర్పంచ్ పదవి టీడీపీకి..

● ఒప్పందంలో భాగంగా ఎన్నిక


మాచర్లకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి అంజలీదేవి

కొండపి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరిదేపి గ్రామ ఉపసర్పంచ్‌గా గంటెనపల్లి మాచర్లను పది మంది వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా గురువారం గ్రామ సచివాలయంలో ఎన్నుకున్నారు. గంటెనపల్లి మాచర్ల పేరును 6వ వార్డు సభ్యుడు కాలే మల్లికార్జున ప్రతిపాదించగా, 4వ వార్డు మెంబర్ మార్పూరి రాజేష్ బలపరిచారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా చేతులెత్తి మాచర్లకు మద్దతు తెలిపారు. గడచిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ, మిత్రపక్షాలు కలిసి పోటీ చేయగా, సీపీఎం ఒంటరిగా పోటీచేసింది. ఆ ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ అభ్యర్థి గెలిచారు. అపుడు తొలుత రెండున్నర సంవత్సరాలు వైసీపీకి చెందిన అంగలకుర్తి రవిని సర్పంచ్‌గా, తర్వాత రెండున్నరేళ్లు టీడీపీకి చెందిన గంటెనపల్లి మాచర్లకు సర్పంచ్ పదవి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకు ఉపసర్పంచ్‌గా ఉన్న చింతపల్లి ప్రసాద్ ఇటీవల రాజీనామా చేశారు. దీంతో ఒప్పందం ప్రకారం గంటెనపల్లి మాచర్ల ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నేడోరేపో సర్పంచ్‌తో కూడా రాజీనామా చేయించి, ఉపసర్పంచ్‌ని సర్పంచ్‌గా కొనసాగించే అవకాశం ఉంది. కాగా ఎన్నికల అధికారిగా ఈవోపీఆర్ఆర్డీ అంజలీదేవి వ్యవహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ప్రేమ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత, టీడీపీ నాయకులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, రావిపాటి వెంకటరావు, మార్పూరి వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకుడు మోపర్తి నారాయణ పాల్గొన్నారు.

మైనింగ్‌కు ప్రజాభిప్రాయ సేకరణ

చీమకుర్తి, మార్చి27(ఆంధ్రజ్యోతి): రామతీర్థం సమీపంలో ఉన్న 14.17 హెక్టార్ల ఏపీఎండీసీ భూముల్లో ఓపెన్‌కాస్ట్ విధానంలో జాయింట్ వెంచర్ కంపెనీ మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించటానికి పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమాన్ని గురువారం రామతీర్థం వీటీసీలో నిర్వహించారు. ఆర్డీవో లక్ష్మీప్రసన్న, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ రాఘవరెడ్డి, తహసీల్దార్ బ్రహ్మయ్య సమావేశంలో పాల్గొన్న స్థానికులు అభిప్రాయాలను రికార్డు చేశారు. ఆర్ఎల్‌పురంనకు చెందిన పమిడి వెంకట్రావు, చంద్రశేఖర్ పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జీఎం నతానియేలు, పీవో శివప్రసాదరెడ్డి, పెరల్ గ్రానైట్ జీఎం పరుచూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నాటక రంగానికి పూర్వ వైభవం తేవాలి

ఒంగోలు కల్చరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తెలుగు నాటకరంగానికి పూర్వ వైభవం తేవాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) అన్నారు. ప్రపంచ రంగస్థల దినత్సోవం సందర్భంగా గురువారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూంలో శ్రీనాగినేని నరసింహారావు మోమోరియల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కళాపోషకులు తిరుపతిరావు చిత్రపటానికి నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు మల్లికార్జునరావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే సూపర్‌స్టార్ కృష్ణ కళా పరిషత్ ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా స్థానిక నెల్లూరు బస్టాండ్‌లోని బండారు రామారావు, డీవీ.సుబ్బారావు విగ్రహాలకు నివాళులర్పించారు. పరిషత్ అధ్యక్షుడు పాలిటి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ చేయడం హేయం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులను వర్గీకరిస్తూ ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబల్లి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్ళా వసంతరావు ప్రత్యేక వేషధారణతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యరమాల మల్లికార్జున, కె.బాబురావు పాలేటి కోటేశ్వరరావు, శాంతారావు, మేదిడ రవి, రమేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రైతు సాధికార సంస్థ మేనేజ్ సంస్థ సహకారంతో జిల్లాలో చేపట్టిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను రాష్ట్రస్థాయి వ్యవసాయ, సెర్ప్ అధికారుల బృందం గురువారం పరిశీలించింది. కొత్తపట్నం మండలం గాదెపాలెం, కొత్తపట్నం, వజ్జిరెడ్డిపాలెం, రంగయ్యపాలెం, మద్దిపాడు మండలం వెల్లంపల్లిలో సాగు చేసిన పంటలను సందర్శించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అధికారి చంద్రశేఖర్, కన్సల్టెంట్ రాజేశ్వరరావు, వెలుగు డీపీఎం డేవిడ్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ

నాగులుప్పలపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ దోహదపడుతుందని హెచ్ఎం షేక్ అబ్దుల్‌కరీమ్‌సాహెబ్ పేర్కొన్నారు. గురువారం బి.నిడమానూరు జడ్పీ హైస్కూలులో పీఎంశ్రీ ద్వారా మంజూరైన స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. గైడ్ కెప్టెన్ షేక్ షర్మిలా, ఉపాధ్యాయుడు కనపర్తి మాల్యాద్రి పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి నన్నెబోయిన వెంకటప్పయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నిరసన

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని జై జనంపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. జై జనం పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మాలల జనాభా ఎక్కువగా ఉన్నా తక్కువగా ఉన్నట్లు గణంకాలు చూపించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఏసుదాసు, ఎస్‌కే.జిలాని, శివరాం, ఎం.రమేష్, పి.కృష్ణబాబు, ఎస్.ధనరాజ్, డి.చిట్టిబాబు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి నివాళి

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సువార్త పరిచారకులు పాస్టర్ ప్రవీణ్ మరణం బాధకరమని జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి సీనియర్ పాస్టర్ డి.జాన్‌అగస్టీన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జేఎంబీసీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాస్టర్ అషేర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీవైఏ ఆధ్వర్యంలో..

నగరంలోని క్లౌపేట క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో పాస్టర్ ప్రవీణ్ మృతిపై కొవ్వొత్తుల నిరసన చేపట్టారు. క్లౌ విగ్రహం వద్ద సంతాపాన్ని తెలిపారు.

చెత్త నుంచి సంపదను సృష్టించాలి

సింగరాయకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పొడి, తడి చెత్త నుంచి సంపదను సృష్టించాలని ఎంపీడీవో డి. జయమణి చెప్పారు. ఈ నెల 21 నుంచి మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని చెత్త సంపద కేంద్రంలో సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్‌పై నియోజకవర్గంలోని ఆరు మండలాల పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్‌మిత్రలకు నిర్వహిస్తున్న ట్రైనింగ్ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల శివరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.రామారావు, ఈవోపీఆర్డీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధుల ప్రణాళికలు

సంతనూతలపాడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రుణ, జీవనోపాధుల ప్రణాళిక సర్వేను వీవోఏలు గ్రామాల్లో పగడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ పి.నారాయణ పేర్కొన్నారు. సంతనూతలపాడులో వెలుగు కార్యాలయంలో 2025-26 వార్షిక సంవత్సరానికి సంబంధించి వీవోఏల శిక్షణా తరగతులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎం టి.బాబూరావు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్యలకు ఆదేశం

● వాగు పోరంబోకు మ్యుటేషన్ చేయటమే కారణం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం చెరువుకొమ్ముపాలెంలో సర్వేనెంబరు 1,2లోని వాగు పోరంబోకు భూమిని అక్రమంగా మ్యుటేషన్ చేసిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి ఆర్‌పీ.సిసోడియా గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. అప్పటి తహసీల్దార్లు మురళీ, శ్రీకాంత్ కేదార్‌నాథ్, జూనియర్ అసిస్టెంట్ వై.హనుమంతరావులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం మురళీ పల్నాడు డీఆర్వోగా, శ్రీకాంత్ కేదార్‌నాథ్ గుంటూరు ఈస్ట్ తహసీల్దార్‌గా, వై.హనుమంతరావు కొండపి అడిషనల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా ఉన్నారు. కాగా డీఆర్వో బి.చినఓబులేషును విచారణాధికారిగా నియమించి రెండు నెలల్లో విచారణ నివేదికను ఇవ్వాలని ఆదేశించారు.

మోటార్‌సైక్లిస్టు మృతి

ఒంగోలు క్రైం, మార్చి27(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న కారును ఢీకొట్టి మోటార్ సైక్లిస్టు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున ఒంగోలులోని మంగమ్మ కాలేజీ సమీపంలో జరిగింది. నగరంలోని బిలాల్‌నగర్‌కు చెందిన షేక్ షాహిద్ (40) మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా ముందు వెళుతున్న కారు స్పీడు బ్రేకర్ల వద్ద స్లో అయింది. దీంతో వెనుక ఉన్న షాహిద్ కారును వేగంగా ఢీకొట్టి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయమై షాహిద్ అక్కడిక్కడే మృతి చెందాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

సంతనూతలపాడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని పెద్ద బజారు వద్ద నున్న మసీదులో గురువారం రాత్రి వైసీపీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఇచ్చారు. మతపెద్ద వస్తద్‌ఫిరోజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ డి.చెంచిరెడ్డి, యలమందారెడ్డి, రహంతుల్లా, మస్తాన్, వలి, కాలేషా పాల్గొన్నారు.

పాపయ్యచౌదరి సేవలు చిరస్మరణీయం

ఒంగోలు(రూరల్), మార్చి27(ఆంధ్రజ్యోతి): పాపయ్యచౌదరి సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఒంగోలు రూరల్ మొదటి సర్పంచ్ చిరుకూరి పాపయ్య చౌదరి సంస్మరణ సభ గురువారం నగరంలోని ఆయన నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఒంగోలు నగర పంచాయతీకి మొదటి సర్పంచ్‌గా ఎన్నికై అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం పాపయ్యచౌదరి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమ్మ వెంకటేశ్వర్లు, కుటుంబసభ్యులు చిరుకూరి శ్రీనివాసరావు, చిరుకూరి రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎగ్జామినర్‌గా చిన్నపరెడ్డి

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థ అకౌంట్స్ విభాగం ఎగ్జామినర్‌గా చిన్నపరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ సెక్రటరీ జె.నివాస్ ఉత్వర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఏలూరులో ఆర్‌డీడీగా పనిచేస్తున్న ఆయనను ఒంగోలుకు బదిలీ చేస్తూ ఉత్వర్వులు ఇచ్చారు. అలాగే ఏలూరి డీడీగాక్రాంతికుమారిని నియమించారు.

నేడు టీడీపీ ఆధర్యంలో ఇఫ్తార్ విందు

సింగరాయకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ టీడీపీ ఆధ్వర్యంలో సింగరాయకొండ ఈద్గా మిట్టలోని షాదీఖానా ప్రాంగణంలో శుక్రవారం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ ఇఫ్తార్‌కు ముఖ్య అతిథులుగా మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మాగుంట రాఘవరెడ్డి హాజరుకానున్నారు. ఇఫ్తార్ విందుకు నియోజక వర్గంలోని ఆరుమండలాల ముస్లింలు హాజరుకావాలని టీడీపీ నేతలు కోరారు.

మూడు పంచాయతీలకు ట్రాక్టర్లు అందజేత

సింగరాయకొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మండలానికి మూడు పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరయ్యాయి. గురువారం కొండపి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి స్వామి పాతసింగరాయకొండ, బింగినపల్లి, శానంపూడి గ్రామ పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

దొంగ పిటీషన్లపై విచారణ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు సొసైటీ సీఈవో వలేటి మనోజ్‌కుమార్ తనపై దొంగ పిటీషన్లు తయారు చేసి ఫిర్యాదు చేస్తున్న వారిపై సమగ్ర విచారణ చేయాలని గురువారం ఒంగోలులో జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్.దామోదర్, రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రికి, సంబంధిత రాష్ట్ర ఉన్నతాధికారులకు తాను ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఒకేరోజు రూ.69.75 లక్షలు పన్నుల చెల్లింపు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం 50శాతం వడ్డీ రాయితీ ఇవ్వడంతో దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న బకాయిలును కార్పొరేషన్ అధికారులు గురువారం వసూలు చేశారు. ఈ మేరకు పలు హోటల్ యజమానులు స్వచ్ఛందంగా ముందుకువచ్చారు. నగరంలో హెటల్ సరోవర్ రూ.8.8లక్షలు, రాజధాని హోటల్ నుంచి రూ.7లక్షలు, కోలాస్ హోటల్ నుంచి రూ.2.5 లక్షలు పన్నులు చెల్లించారు. ఈ మేరకు చెక్కులను కమిషనర్ కె.వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డీ రాయితీని బకాయిదారులు వినియోగించుకోవాలని కోరారు. గురువారం రోజు మొత్తం రూ.69.75లక్షలు వసూలు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకరశెట్టి శ్రీనివాసరావు, సచివాలయ అడ్మిన్ సెక్రటరీ నాగార్జున పాల్గొన్నారు.

ఈవీఎంను పరిశీలించిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియా రాజకీయపార్టీల నాయకులతో తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలు అందజేస్తున్న సేవాసంఘాల ప్రతినిధులు

జేబులో డబ్బులున్నా కొనుక్కొని ఆహార పదార్థాలు తినలేని పరిస్థితి వారిది. కనీసం గుక్కెడు నీళ్లు కూడా దొరకని దుస్థితి. ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు పక్కరాష్ట్రం నుంచి వందల కిలోమీటర్లు పాదయాత్ర చేసి నానా కష్టాలతో తిరుగు పయనమయ్యే అవస్థల ప్రయాణం వారిది. ఒకవైపు ఆకలి, మరోవైపు రైళ్ల కోసం ఎదురుచూపులు. ఇదంతా పుష్కర కాలం క్రితం పరిస్థితి. వారి కష్టాలను చూసి చలించిన కొందరు సహృదయత కలిగిన పెద్దలు వారి ఆకలిదప్పులు తీర్చేందుకు ముందుకు వచ్చారు. ఏటా క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను, శుద్ధిజలాన్ని వారికి అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మార్కాపురం పట్టణానికి చెందిన పలు స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంఘాల ప్రతినిధులు. మొదట్లో వందలతో మొదలై నేడు వేలాది మందికి సాంత్వన చేకూరుస్తూ సేవకు ప్రతిరూపాలుగా దర్శనమిస్తున్నారు



నల్లమల అటవీమార్గంలో శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న కర్ణాటక భక్తులు

పుష్కర కాలంగా కర్ణాటక భక్తుల సేవలో..

ఉగాదికి శ్రీశైలం వచ్చి వెళ్లే యాత్రికుల ఆకలి తీరుస్తున్న వైనం

మార్కాపురం రైల్వేస్టేషన్‌లో ఏటా అన్నదానం

మార్కాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబిక అమ్మవారిని కర్ణాటక ప్రజలు పుట్టింటి ఆడబిడ్డగా భావిస్తారు. ఉగాదికి ముందు లక్షలాది మంది భక్తులు శ్రీశైలం చేరుకుని అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీ. అదీ కూడా కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. వారంతా తిరుగు ప్రయాణంలో మార్కాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైళ్లలో వెళ్తుంటారు. ఈ క్రమంలో ఉగాది పర్వదినం రోజు, మరుసటి రోజు మార్కాపురం రైల్వేస్టేషన్ కిక్కిరిసిపోతుంది. సుమారు 20 వేల మందికిపైగా కన్నడ భక్తులు ఆ రెండు రోజుల్లో రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణాన్ని సాగిస్తుంటారు. ఈ క్రమంలో వారి వద్ద డబ్బులు ఉన్నా, ఆహార పదార్థాలు అందని పరిస్థితి. ఈ విషయాన్ని గమనించిన పట్టణానికి చెందిన పలువురు దాతలు 13 సంవత్సరాలుగా రెండు రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజల నుంచి సేకరించిన విరాళాలతో ఆహార పదార్థాలను అక్కడే వండి కర్ణాటక భక్తుల ఆకలిని తీరుస్తున్నారు. ఈ సంవత్సరం కూడా అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో భారీ ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారు.



కన్నడ భక్తులతో కిటకిటలాడే మార్కాపురం రైల్వేస్టేషన్ (ఫైల్)

వెయ్యిమందితో మొదలై నేడు పదివేల మందికి..

మార్కాపురం ప్రయాణికుల సంఘంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు 2012వ సంవత్సరంలో కర్నాటక భక్తుల ఇబ్బందులను గమనించి వెయ్యిమందికి పులిహోర అందజేయడంతో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఏటా భక్తుల రద్దీకి అనుగుణంగా ఈ సేవా కార్యక్రమాన్ని విస్తరిస్తున్నారు. ఐదేళ్ల నుంచి సంవత్సరానికి 10 వేల మందికి తగ్గకుండా అన్నదానం చేస్తున్నారు. ముఖ్యంగా ఆహార పదార్థాలతోపాటు తాగునీటిని సీసాల్లో అందజేస్తున్నారు. డబ్బులిచ్చి కొనుక్కోవాలన్నా భక్తుల రద్దీ కారణంగా దుకాణాల్లో కూడా నీటిసీసాలు దొరకని పరిస్థితి. సుమారు 20 వేల లీటర్ల శుద్ధి జలాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా అందజేస్తున్నారు. తొలినాళ్లలో పట్టణానికి చెందిన పలు సేవాసంస్థల ప్రతినిధులైన చక్కా మాలకొండ నరసింహారావు, అప్పటి డీఆర్‌యూసీసీ సభ్యులు షేక్ ఇస్మాయిల్, గుంటక వెలుగొండారెడ్డి, కొప్పరపు శ్రీనివాసరావు, ఆర్‌కేజే నరసింహం, కశ్శెట్టి సుబ్బారావు, చినమనగొండ బాబూరావు, కలువా భాస్కర్, నల్లాన్ చక్రవర్తుల నరసింహాచార్యులు తదితరులు ప్రత్యేక చొరవ తీసుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు వందలాది మంది దాతలు ముందుకు వచ్చి చందాలు ఇస్తున్నారు. పలు సంస్థలకు చెందిన వాళ్లు రెండు రోజులపాటు నిరంతరాయంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

నేడు ఢిల్లీకి కలెక్టర్

- రేపు స్కోచ్ అవార్డు స్వీకరణ
- బంగారు బాల్యం ప్రాజెక్టుకు అవార్డు ప్రకటించిన ఆ సంస్థ

ఒంగోలు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం ఢిల్లీ వెళ్లనున్నారు. శనివారం అక్కడ స్కోచ్ సంస్థ అందించే అవార్డును స్వీకరించనున్నారు. దేశంలో ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ సంస్థ ప్రతి ఏటా దేశాన్ని మెరుగైన దేశంగా మార్చేందుకు కృషి చేసే వ్యక్తులు, సంస్థలు, అందుకు అమలు చేసే ప్రాజెక్టుకు అవార్డులు ఇస్తుంది. గతంలో ఇటు రాష్ట్రంలో అటు తెలంగాణాలోనూ ప్రభుత్వ ఏజెన్సీలను కూడా ఇలాంటి అవార్డులకు స్కోచ్ సంస్థ ఇచ్చింది. కాగా కలెక్టర్ అన్సారియా తన ఆలోచనలతో బాలికలకు బంగారు భవిష్యత్ లక్ష్యంగా జిల్లాలో అమలు చేపట్టిన బంగారు బాల్యం ప్రాజెక్టుకు స్కోచ్ సంస్థఅవార్డును ప్రకటించింది. బాల్య వివాహల నిరోధం, బాలికలవిద్య, ఆరోగ్యం మెరుగు, పౌష్టికాహారం అందించడం, రక్తహీనత నిరోధం వంటి అంశాలపై విభిన్న వర్గాలలో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా ప్రజలను చైతన్యంచేసి బాలికలకు సమాజం అండగా నిలిచే ప్రయత్నం ఈ ప్రాజెక్టు ద్వారా చేపట్టారు. అలాగే బాల కార్మిక నిరోధం, బాల్య వివాహలతో అనాథలుగా మిగిలిన చిన్నారుల భవిష్యత్‌కోసం పలు కార్యక్రమాలను చేపట్టారు. ఈ క్రమంలో స్కోచ్ సంస్థ అవార్డు నామినేషన్‌లో బంగారు బాల్యం ప్రాజెక్టును పంపించగా మూడు దశల్లో స్క్రీనింగ్, పబ్లిక్ మీటింగ్‌లో ముందువరుసలో నిలిచి అవార్డును దక్కించుకొంది. శనివారం సాయంత్రం ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియా ఈఅవార్డును అందుకోనున్నారు.

పాఠశాల కిచెన్ గార్డెన్‌లకు రూ. 39.35 లక్షల మంజూరు

ఒంగోలు విద్య, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పీఎం పోషణ్(మధ్యాహ్న భోజనం) పాఠశాల పరిసరాల్లో పోషకాలున్న ఆకుకూరలు, కూరగాయల తోటల అభివృద్ధికి రూ. 39.35 లక్షలు విడుదల చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఒక్కొక్క పాఠశాలకు రూ .5వేల చొప్పున మొత్తం 787 పాఠశాలలకు ఈనిధులు విడుదల చేశారు. ఒంగోలు మండలానికి అత్యధికంగా 40 పాఠశాలలకు రెండులక్షలు, అతి తక్కువగా కొండపి మండలంలో ఐదు పాఠశాలలకు రూ. 25వేలు విడుదల చేశారు. జిల్లాలోని అన్ని మండలాలకు సంబంధించి మండల విద్యాధికారి-1ల ఖాతాలకు ఈ నిధులు జమ చేశారు.

పశువుల కాపరే పరమాత్ముడు

- రేపే కాటంరాజు తిరునాళ్ల
- భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు
- మార్కాపురం నుంచి ప్రత్యేక బస్సులు



ఊరేగింపునకు సిద్ధంగా ఉన్న బొల్లావులు (ఇన్‌సెట్లో) కాటంరాజు మూలవిరాట్

పెద్దారవీడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆయన మూగజీవాలకు సంరక్షకునిగా జీవనం ప్రారంభించాడు. చివరకు వాటి రక్షణకోసం పోరాటాలు సైతం చేసి ఆయుధం పట్టాడు. విజేతగా నిలిచాడు. చివరకు పశుసంపదపై జీవనం సాగించే వారందరికీ పరమాత్మునిగా మారాడు. ఆయనే వేనూతల కాటమరాజు.

ఇదీ కాటమరాజు చరిత్ర

కనిగిరి ప్రాంతానికి సామంతరాజుగా ఉన్న కాటమరాజుకు పశుసంపదే ముఖ్య ఆదాయవనరు. నీటి వనరుల లభ్యతకు కరువు ఏర్పడటంతో నెల్లూరు పరిసరాలకు పశుసంపదను పంపేందుకు అక్కడి సామంతరాజు మనుమసిద్ధితో ఒప్పందం చేసుకున్నాడు. అలా వెళ్లిన పశువులు గడ్డి మేస్తుండగా చిలుకలు పెద్దపెద్దగా అరవడంతో పశువులు బెదిరిపోయాయి. దీంతో పశువుల కాపరి చిలుకలను చంపేశాడు. అలా మరణించిన చిలుకల్లో నల్లసిద్ధి భార్య కుందూదేవి పెంపుడు చిలుక కూడా ఉంది. దీంతో ఆగ్రహానికి గురైన కుందూదేవి కాటమరాజుకు చెందిన పశుసంపదను చంపేయించింది. దీంతో కాటమరాజు నష్టపరిహారం చెల్లించాలని కబురు పంపుతాడు. అది ఇష్టంలేని నల్లసిద్ధి కయ్యానికి కాలుదువ్వుతాడు. దీంతో కృష్ణావతారంగా భావించే బొల్లావును పూజించి కాటమరాజు యుద్ధానికి బయలుదేరుతాడు. ఆ యుద్ధం జరుగుతున్న సమయంలో నల్లమల అటవీప్రాంతంలో కాటమరాజు ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నాడు. దీని ఇతివృత్తాంతంగా ప్రస్తుతం పెద్దారవీడు మండలం గుండంచర్ల శివారులో కాటమరాజు దేవస్థానం వెలిసింది.

భారీగా తరలిరానున్న భక్తులు

కాటమరాజుకు ఏటా ఉగాది పర్వదినం ముందురోజున తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామ శివారులో ఉన్న కాటమరాజు దేవస్థానానికి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకోవడం ఆయన పట్ల వారికున్న విశ్వాసానికి నిదర్శనం. ఉత్సవాలలో భాగంగా స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, బొల్లావుల ఊరేగింపులు ఉంటాయి. భక్తులను అలరించి, ఆకర్షించేందుకు వివిధ పార్టీల నాయకులు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు

మార్కాపురం పట్టణానికి 30 కి.మీ దూరంలో గుండంచర్లలో దేవస్థానం ఉంది. భక్తులు మార్కాపురం నుంచి అక్కడకు చేరుకోవడానికి ఏపీఎస్ ఆర్‌టీసీ శుక్రవారం ఉదయం నుంచి మరుసటి రోజు వరకూ 10 బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి

- పడిపోయిన పోతురాజు కాలువ రక్షణగోడలు
- వాహనదారుల ఆందోళన



ఒంగోలు నగరంలోని పోతురాజుకాలువ బ్రిడ్జి ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. బ్రిడ్జికి ఇరువైపులా ఉండే రక్షణ గోడ కొన్ని నెలలుగా పాడైపోయి కూలిపోయింది. దీంతో పేరుకే బ్రిడ్జిగా ఉండగా, దీనిపై రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా రాత్రి వేళ వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. బ్రిడ్జి పై కనీసం లైటు కూడా లేకపోవడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. అలాగే పట్టించుకోకుండా వదిలేస్తే ప్రాణాలకే ప్రమాదమని ఆవైపు రాకపోకలు సాగించే కేశవరాజుకుంట, బలరాంకాలనీ, భగత్‌సింగ్ కాలనీ, మిలటరీ కాలనీ, ముక్తినూతలపాడు వైపు రాకపోకలు సాగించే ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

బాలల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను, బాల్య వివాహాల నిర్మూలన, బాలల బాల్యాన్ని బంగారం చేయడమే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. బంగారుబాల్యం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ రిసోర్స్ సెంటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి బాలల వనరుల కేంద్రంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని బాలల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాయంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రత్యేకంగా నీతి ఆయోగ్ నుంచి ఒక ప్రతినిధి ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ కేంద్రంద్వారా బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహలపై అవగాహనే వంటి అంశాలపై ప్రత్యేకంగా పనిచేస్తారని తెలిపారు. జిల్లాలో చేపట్టిన బంగారు బాల్యం కార్యక్రమానికి స్కోచ్ అవార్డు రావడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేషు, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన రెడ్డి, వివిధ శాఖల అధికారులు హేనసుజన, అర్చన, సుశీల, డాక్టర్‌వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, చిరంజీవి, జి. వెంకటనాయుడు, శ్రీనివాసులుతో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.



జిల్లా రిసోర్సు సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా

మూతలున్నా వేయరు - నిర్లక్ష్యం వీడరు

- ట్యాంకర్ డ్రైవర్ల తీరుతో రోడ్లంతా నీరు
- ప్రమాదాల బారిన ద్విచక్ర వాహనదారులు





మూత సరిగా వేయకపోవడంతో ఒలికిపోతున్న నీరు



నగరపాలక సంస్థ ద్వారా శివారు కాలనీలకు తరలించే తాగునీరు రోడ్డుపాలవుతోంది. ఫిల్టర్ బెడ్ నుంచి ప్రతి రోజు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా 200 ట్రిప్పులకు పైగా సరఫరా చేస్తుంటారు. అయితే వాటిని సక్రమంగా తీసుకెళ్ళడంలో డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ట్యాంకర్లలో నీరు కాలనీలకు చేరేలోపు రోడ్లమీద ఏరులై పారడంతో ద్విచక్ర వాహనదారులు నిరంతరం ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రత్యేకించి మలుపుల్లో వాహనాలు తిప్పే క్రమంలో జారిపడటం నగరంలో సర్వసాధారణమైంది. ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకపోయినా, రోడ్లమీద నీరుపారడంతో బైక్‌లు అదుపు తప్పి చోదకులు కిందపడిపోతున్నారు. ఇదంతా తెలిసినా ఇంజనీరింగ్ అధికారులు కూడా ఏమాత్రం పట్టించుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం ట్యాంకర్లకు మూతలు కూడా వేయకుండా అలాగే తరలించడంతో గుంతలు, ఎత్తుపల్లాలు, స్పీడ్ బ్రేకర్ల వద్ద నీరు ఒలికిపోతోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, మహిళలు నిరంతరం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అధికారులు స్పందించి తాగునీటి ట్యాంకర్లకు మూతలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

అవీ..ఇవీ

రోడ్డు ప్రమాదంలో మైనింగ్ వ్యాపారి మృతి

● కారు-లారీ ఢీకొనడంతో ఘటన



కారులోనే మృతి చెందిన గోవిందాచారి

బేస్తవారపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలోని పందిళ్లపల్లె టోల్‌ప్లాజా సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరోకరు గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ పట్టణానికి చెందిన జి.గోవిందాచారి(45) గుత్తి పట్టణంలో మైనింగ్ వ్యాపారం చేస్తుంటాడు. కారులో బుధవారం రాత్రి గుత్తికి వెళుతున్నాడు. బేస్తవారపేట జాతీయ రహదారిలోని పూసలపాడు-పందిళ్లపల్లె వద్ద అదేసమయంలో మిర్చిలోడుతో మినీలారీ ఎదురుగా వచ్చింది. ప్రమాదవశాత్తు ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న గోవిందాచారి అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. మినీ లారీడ్రైవర్‌కు గాయాలు కాగా వైద్యశాలకు తరలించారు. గోవిందాచారి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిరపకాయల లారీ బోల్తా



బోల్తాపడ్డ మిరపలారీ

పెద్దారవీడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మిరప కాయల లారీ బోల్తా పడిన ఘటన గురువారం తెల్లవారుజామున మండలంలోని దేవరాజు గట్టు సమీపంలో చోటుచేసుకుంది. పోలీ సులు తెలిపిన కథనం ప్రకారం, నంద్యాల జిల్లా బనగానిపల్లికి చెందిన లారీ మిరపకాయల లోడుతో గుంటూరు వెళుతోంది. దేవరాజుగట్టు సమీపంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉండగా లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలో రైతులు, డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి.

మొరాయించిన రైల్వేగేటు

● ఇబ్బందులుపడ్డ వాహనదారులు
● మూడు గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్



రైల్వేగేటు వద్ద నిలిచిన ట్రాఫిక్

గిద్దలూరుటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాచర్ల రైల్వేగేటు మొరాయించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ట్రాఫిక్ ఇరువైపులా భారీగా స్తంభించి నిలిచిపోయింది. గురువారం ఉదయం 7 గంటల నుండి 10గంటల వరకు రైల్వేగేటు మొరాయించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మొరాయించిన గేట్లకు రైల్వే సిబ్బంది మరమ్మతులు చేపట్టినప్పటికీ అంతరాయాలు ఏర్పడ్డాయి. 3 గంటలపాటు వాహనాలు, భారీ వాహనాలు, ద్విచక్రవాహనాలు ఇరువైపులా కిలోమీటర్ల మేర స్తంభించాయి. వాహనదారులు ఎండకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడి ఓ దశలో అసహనానికి గురై రైల్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇటీవల కాలంలో పలుమార్లు గేటు అంతరాయం కలిగించింది. ప్రత్యామ్నాయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని గేటు సమస్య నుంచి విముక్తి చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గిద్దలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల లేక పోవడం, కేవలం ప్రైవేటు కళాశాలలు మాత్రమే ఉండడంతో పేద కుటుంబాల విద్యార్థులు ఫీజులు చెల్లించలేక విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, పాలకులు స్పందించి ప్రభుత్వం తరపున జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కె.ఆరూన్, తేజ, ఈశ్వర్, అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

గిద్దలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏబీఎంపాలేనికి చెందిన నిరుపేద పానుగంటి డానియేలు అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబానికి ఓర్నన్ ఫౌండేషన్ బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను అందించింది. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బద్దీటి అల్లూరయ్య, జాకోబ్, ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.

పెయింట్ షాప్‌లో అగ్ని ప్రమాదం

● షార్ట్ సర్క్యూట్‌తో ఘటన ● రూ.5 లక్షల విలువ చేసే సామగ్రి దగ్ధం



అగ్నిప్రమాదం జరిగిన పెయింట్ షాప్

మార్కాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తర్లుపాడు రోడ్డు లోని పూలసుబ్బయ్య కాలనీలో గురువారం ఓ పెయింట్ దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. ఈ ఘటనలో దుకాణంలోని పెయింట్స్ ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.5 లక్షల విలువైన సామగ్రి దగ్ధమైంది. ఫైర్ అధికారి రామకృష్ణ కథనం మేరకు, పట్టణానికి చెందిన తనుబుద్ది వెంకటేశ్వరరెడ్డి పూలసుబ్బయ్య కాలనీ చివర మెయిన్ రోడ్డులో పెయింట్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన దుకాణదారులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఈ లోగానే దుకాణంలో మంటలు వ్యాప్తిచెందాయి. యజమానులు వెంటనే అప్రమత్తమై సాధ్యమైనమేర సామగ్రిని దుకాణంలో నుంచి బయటకు చేర్చారు. హుటాహుటిన ఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్ చేరుకుంది. సిబ్బంది మంటలను దాదాపు అదుపు చేశారు.. మండే స్వభావం ఉండటంతో వస్తువులు ఉండడంతో దాదాపు రూ.5 లక్షల విలువచేసే పెయింట్స్ యంత్ర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి.

వైసీపీ ఖాతాలోనే ఎంపీపీలు

ఖాళీ స్థానాలను తిరిగి కైవసం చేసుకున్న ఆ పార్టీ అభ్యర్థులు



త్రిపురాంతకం ఎంపీపీగా ఎన్నికైన సుబ్బయ్మ, పుల్లలచెరువు వైస్ ఎంపీపీ రాములు



డిక్లరేషన్‌ఫాంపై సంతకం చేస్తున్న త్రిపురాంతకం ఎంపీపీ సుబ్బమ్మ

మార్కాపురం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి). మార్కాపురం మండల ఎంపీపీగా తిప్పాయపాలెం వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు బండి లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఎన్నిక డీఎల్‌డీవో, రిటర్నింగ్ అధికారి కొల్లి శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు నిర్వహించారు. మార్కాపురం మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా గోగులదిన్నె ఎంపీటీసీ సభ్యులు రాజీనామా చేయగా, నికరంపల్లి ఎంపీటీసీ సభ్యులు మృతిచెందారు. దీంతో 13 మంది ఎంపీటీసీ సభ్యులు మాత్రమే ఉన్నారు. గురువారం నిర్వహించిన ఎంపీపీ ఎన్నికలో 13 మంది సభ్యులు హాజరయ్యారు. వారిలో తిప్పాయపాలెం ఎంపీటీసీ సభ్యురాలు బండి.లక్ష్మీదేవిని హాజరైన ఎంపీటీసీలందరూ కలిసి ఏకగ్రీవ్రంగా ఎన్నుకున్నారు. సీఐ సుబ్బారావు, రూరల్, పట్టణ ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీగా ఎన్నికైన బండి లక్ష్మీదేవిని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా.రాంబాబు, ముఖ్య నాయకులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక గురువారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైసీపీ సభ్యుల మద్దతుతో సయ్యద్ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి ఏ.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. మండలంలో 18 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా 10 మంది వైసీపీ, 8 మంది టీడీపీ సభ్యులు ఉన్నారన్నారు. వైసీపీ నుంచి సయ్యద్ సాధిక్, టీడీపీ నుంచి షేక్ చిన్నఖాశీంలు నామినేషన్ వేశారు. ఈ ఎన్నికల్లో సాధాక్ గెలుపొందాడు.

పుల్లలచెరువు : మండల ప్రజాపరిషత్ వైస్ ఎంపీపీగా వైసీపీకి చెందిన లింగంగుంట్ల రాములు ఎన్నికయ్యారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారి దేవేంద్రకుమార్, ఎంపీడీవో వసంత రావు సభ్యులకు బహిరంగ ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా, 14 మంది హాజరయ్యారు. కాగా టీడీపీకి ఏడుగురు, వైసీపీకి ఏడుగురు సభ్యులు చేతులెత్తి మద్దతు తెలిపారు. గంగవరం ఎంపీటీసీ సభ్యులు ఓటింగ్‌కు హాజరు కాలేదు. దీంతో అధికారులు లాటరీ నిర్వహించారు. మల్లాపాలెం ఎంపీటీసీ సభ్యుడు రాములు లాటరీలో విజయం సాధించాడు.

త్రిపురాంతకం : కేసులు, వ్యూహాలు, ఆరోపణల నడుమ తీవ్ర ఉత్కంట రేపిన త్రిపురాంతకం ఎంపీపీ పీఠం ఎట్టకేలకు వైసీపీ కైవసం చేసుకుంది. గురువారం జరిగిన ఎంపీపీ ఎన్నికల సందర్భంగా మండలంలోని 18 ఎంపీటీసీలకు గానూ 17 మంది హాజరయ్యారు. జి.ఉమ్మడివరం ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల అంజనేయరెడ్డి రిమాండు ఖైదీగా ఉండడంతో ఎన్నికకు హాజరుకాలేదు. ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే టి.చంద్రశేఖర్ కూడా ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు. కాగా రిటర్నింగ్ అధికారి వండర్‌మ్యాన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభించగానే సోమేపల్లి ఎంపీటీసీ ఆళ్ళ సుబ్బమ్మను ఎంపీపీ అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నట్లు విశ్వనాథపురం ఎంపీటీసీ సభ్యుడు జి.ముసలయ్య ప్రతిపాధించారు. మిరియంపల్లి ఎంపీటీసీ శాయపనేని సుబ్బారావు బలపరిచారు. సుబ్బమ్మకు తొమ్మిదిమంది మద్దతుగా చేతులెత్తారు. అనంతరం వైసీపీ రెబల్ అభ్యర్థిగా ఉన్న రాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు చల్లా జ్యోతిని ఎంపీపీ అభ్యర్థిగా ప్రతిపాదిసున్నట్లు నడిగడ్డ ఎంపీటీసీ సభ్యుడు కోట్ల సుబ్బారెడ్డి ప్రతిపాధించారు. గొల్లపల్లి ఎంపీటీసీ ఎనిబెర ఎసేబు బలపరిచారు. చల్లా జ్యోతికి మద్దతుగా ఎనిమిది మంది సభ్యులు చేతులెత్తారు. దీంతో ఒక ఓటు అదనంగా రావడంతో ఆళ్ల సుబ్బమ్మ ఎంపీపీగా ఎన్నికైనట్లు ఆర్‌వో వండర్‌మ్యాన్ ప్రకటించారు. అనంతరం బయటకు వచ్చిన చల్లా జ్యోతి తమ వర్గంలోని ఎంపీటీసీలను ఎమ్మెల్యే చంద్రశేఖర్ ప్రలోభాలకు గురిచేశారని, తమకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియ ముగించుకుని గెలుపొందిన ఎంపీపీ సుబ్బమ్మ, ఎంపీటీసీలతో బయటకు వచ్చిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను గుర్తించాలని అన్నారు. కాగా ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరుగకుండా దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు 144 సెక్షన్, బందోబస్తు నిర్వహించారు.

కంభం : కంభం మండలం తురిమెళ్ల మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్‌గా ఏలం వెంకటేశ్వర్లు (టీడీపీ) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. గతంలో ఉపసర్పంచ్‌గా ఉన్న షేక్ జిలాకాభీ వ్యక్తిగత కారణాలతో ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. గురువారం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఎన్నికకు తురిమెళ్ల సర్పంచ్ మాదా సుభద్ర, ఏడుగురు వార్డుసభ్యులు హాజరయ్యారు. 9వ వార్డుకు చెందిన ఏలం వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో వెంకటేశ్వర్లుతో ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువీకరణపత్రం అందచేసినట్లు విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, పంచాయతీ కార్యదర్శి ఎ.అంజనేయులు, మాజీసర్పంచ్ నారిశెట్టి వీరమ్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





మార్కాపురం ఎంపీపీగా నియామకపత్రం అందుకుంటున్న లక్ష్మీదేవి, కంభం ఉపసర్పంచ్‌గా నియామకపత్రంతో వెంకటేశ్వర్లు

భూ సమస్యలు పరిష్కరించేందుకే పర్యటనలు

● వెబ్‌ల్యాండ్‌పై వచ్చిన అర్జీలు పరిష్కరిస్తున్నాం
● జిల్లా సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ



రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

ఎర్రగొండపాలెం, మార్చి 27, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెబ్‌ల్యాండ్ సమస్యలపై జేసీ లాగిన్‌కు 853 అర్జీలు ఆన్‌లైన్ కోసం దరఖాస్తు చేశారని, మండల కేంద్రాలకు రైతులను పిలిపించి ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరిస్తున్నామని జేసీ కె .గోపాలకిష్ణ తెలిపారు. ఎర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలు, ఆన్‌లైన్ సమస్యలపై జిల్లాలో 8500 వినతులు రైతులు అందజేశారన్నారు. వాటిలో వెబ్‌ల్యాండ్‌పై 853 అర్జీలను స్వయంగా రైతులతో విచారించి పరిష్కరిస్తామన్నారు. త్రిపురాంతకం మండలంలో 25 వెబ్‌ల్యాండ్ సమస్యలు పరిష్కరించామన్నారు. ఎర్రగొండపాలెం మండలంలో ఉన్న అర్జీలను ఈ రోజు పరిశీలించామన్నారు. దేవదాయభూములు ఏ ఆలయంపై ఆర్వోఆర్ ఉంటే ఆపేరు మీదనే ఆన్‌లైన్ చేయాలన్నారు. జిల్లాలో 38 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే జరుగుతుందన్నారు. ఏప్రిల్ 26 నాటికి డ్రాఫ్టు ఆర్‌వోఆర్ పూర్తవుతుందన్నారు. మే చివరి వారానికి రైతులకు భూములకు ఆన్‌లైన్ పూర్తిచేస్తా మన్నారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్, తహసీల్దారు శైలేంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జుననాయుడు పాల్గొన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్లను నియమించండి

ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాలలో ఇన్‌చార్జ్ తహసీల్దార్లతో పనులు జరగక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని గురువారం సాయంత్రం ఎర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయం వద్ద జేసీగోపాలకృష్ణను కలసి విజ్ఞప్తి చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దారు కార్యాలయంలో ఎప్పుడు ఉంటారో తెలియడం లేదన్నారు దీనిపై ఆయన స్పందిస్తూ.. త్వరలో రెగ్యులర్ తహసీల్దార్లను నియమిస్తామన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

పొదిలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పంచ ప్రాధాన్యతాంశాలను సకాలంలో పూర్తి చేయాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రానున్న మూడు నెలల్లో ప్రభుత్వం సూచించిన రైతుకుంటలు, కాలువల పూడికతీత, మంచినీటి, ఇరిగేషన్ చెరువులలో పూడిక తీయడం, పశువుల నీటితొట్ల నిర్మాణం, కూలీలకు సరాసరి రూ.290 కూలివచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కూలీలతో నిర్ధేశించిన కొలతలతో పనులు చేసే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎండతీవ్రత నుంచి కూలీలు ఉపశమనం పొందేందుకు నీడ, తాగునీరు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ లలితకుమారి, ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు, ఏపీవో వెంకటేశ్వర్లు, టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొమరోలు : ఎంజీఎన్ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా కూలీలకు ప్రతి రోజు కూ.300లు వచ్చేలా పనులు చేయించాలని ఎంపీడీవో మస్తాన్‌వలి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో శ్రమశక్తి సంఘాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మస్తాన్ వలి మాట్లాడుతూ ప్రతి కూలీకి పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనన్నారు. వారికి మంచి కూలీ ఇప్పించేందుకు నియమ నిబంధనలకు లోబడిపనులు చేయించాలన్నారు. ఈ శిక్షణలో మేట్ విధులు, బాధ్యతలు కూలీలకు హాజరు వేయడం, ఎన్ఎంఎంఎస్ యాప్ గురించి, మస్టర్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఒక రోజుకు ఒక మనిషికి ఎంత పనిచేస్తే గరిష్ఠ వేతనం రూ.300లు వస్తుందనే విషయాన్ని కూడా తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీవో మహాలక్ష్మి, ఈసీ కోటిరెడ్డి, టీఏలు శ్రీనివాసులు, బాలిరెడ్డి, లక్ష్మిరెడ్డి, నాగన్న, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

పేదలకు భూములు కేటాయించాలి

జిల్లా సీపీఐ కార్యదర్శి ఎంఎల్ నారాయణ

బేస్తవారపేట, మార్చి26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ, నివేశ స్థలాలు, సాగు భూములు కేటాయించాలని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ గిద్దలూరు నియోజకవర్గ సమితి సమావేశం రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి డాకాల పుల్లయ్య అధ్యక్షతన బేస్తవారపేటలో గురువారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా ఎంఎల్ నారాయణ పాల్గొని మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదలను అదుకోవాలని ఉద్యమాలు చేస్తున్నట్లు ఆయన అన్నారు.ప్రభుత్వం ఉద్యమాలకు ఆటంకం కలిగించిన వేల మంది పేదలు ఈ ఉద్యమాల్లో పాల్గొని విజయవంతం చేశారని అన్నారు.గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి సెంటు,సెంటున్నర స్థలాలు నిర్మాణం కోసం కేటాయిస్తే ప్రజలకు ఉపయోగపడలేదని అన్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలో భాగాంగా పేదలకు సరిపడ స్థలం కేటాయిస్తామన్నారుత్వరతిగతన కేటాయించాలని అన్నారు.ఈకార్యక్రమంలోని యోజకవర్గ కార్యదర్శి కె.వెంకటరమణ,సహాయ కార్యదర్శి ఊరుమార్చు జోసఫ్,ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.యోగయ్య,కంభం మండల కార్యదర్శి ఎలం శ్రీనివాసులు,ఎం.కొండయ్య,రైతు సంఘం అధ్యక్షులు జె.అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థుల విజయంపై ఎమ్మెల్యే హర్షం

ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

ఎర్రగొండపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలో గురువారం నిర్వహించిన పలు ఎన్నికల్లో వైసీపీ తన పట్టునిలుపుకోవడంపై ఎమ్మెల్యే తాడిపత్రి చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. త్రిపురాంతకం ఎంపీపీ పదవి, పుల్లలచెరువు మండల ఉపాధ్యక్ష పదవి, ఎర్రగొండపాలెంలో కో-ఆప్షన్ సభ్యుల పదవులను వైసీపీ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధించారు. దీంతో గురువారం ఆయన విలేకర్లతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఎరిక్షన్ బాబు ఎన్నికల కోసం ఎరిక్షన్‌బాబు ఎన్ని కుయుక్తులు పన్నినా, ఒక్క అభ్యర్థిని కూడా గెలిపించుకోలేక పోయాడన్నారు. త్రిపురాంతకం ఎంపీపీ అభ్యర్థిపై టీడీపీ ఇన్‌చార్జి అక్రమ కేసు పెట్టించి జైల్లో ఉంచినా, త్రిపురాంతకం ఎంపీపీ అభ్యర్థిగా ఆళ్ల ఆంజనేయ రెడ్డి భార్య సుబ్బమ్మ ఘన విజయం సాధించారన్నారు. పుల్లలచెరువు మండలపరిషత్ ఉపాధ్యక్షులుగా వైసీపీ అభ్యర్థి లింగంగుంట్ల రాములు లాటరీలో విజయం సాధించారన్నారు. ఎర్రగొండపాలెం మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడిగా సయ్య ద్ సాధిక్‌లు విజయం వైసీపీకి ప్రజా మద్దతును ప్రతిబింభిస్తోందన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జ్ అక్రమాలకు పాల్పడుతున్నాడని, ఆయనపై వెలికి తీయిసామన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు ఒంగోలు మూర్తిరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనరు కొప్పర్తి ఓబులరెడ్డి, నాయుడుపాలెం సర్పంచి ఆవుల కోటిరెడ్డి, వైసీపీ నాయకులు ముసలారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ అధ్యక్షుల ఎన్నిక

గిద్దలూరు: నియోజకవర్గంలో వైసీపీ మండలశాఖల అధ్యక్షులను ఆ పార్టీ ప్రకటించింది. వైసీపీ గిద్దలూరు మున్సిపాలిటీ అధ్యక్షులుగా మానం బాలిరెడ్డి, గిద్దలూరు రూరల్, మండలశాఖల అధ్యక్షులుగా బత్తెం ఓబులరావు, అర్ధవీడు మండలశాఖ అధ్యక్షులుగా ఏరువ రంగారెడ్డి, కొమరోలు మండలశాఖ అధ్యక్షులుగా మీనిగ రవికుమార్, రాచర్ల మండలశాఖ అధ్యక్షులుగా ఏలం మురళీకృష్ణ, బేస్తవారపేట మండలశాఖ అధ్యక్షులుగా ఆవుల శ్రీధర్‌రెడ్డి, కంభం మండలశాఖ అధ్యక్షులుగా గొంగటి చెన్నారెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది.

బాలిరెడ్డికి అభినందన

గిద్దలూరుటౌన్ : వైసీపీ పట్టణ పార్టీ కన్వీనర్‌గా నియమితులైన కౌన్సిలర్ మానం బాలిరెడ్డిని గురువారం పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు అభినందించి సన్మానించారు. వైసీపీ ముఖ్యనాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలిరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మాజీ సైనికుల జేఏసీ చైర్మన్‌గా అంకన్న



ఎన్నికైన నూతన కార్యవర్గం

గిద్దలూరుటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల జేఏసీ చైర్మన్‌గా కెప్టెన్ జీసీ అంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మాజీ సైనికుల సమావేశం నిర్వహించారు. గిద్దలూరు మాజీ సైనికుల కమిటీని ఏర్పాటు చేయగా ఇందులో చైర్మన్ కెప్టెన్ అంకన్న, వైస్‌చైర్మన్లుగా కోటారెడ్డి, సీహెచ్. లక్ష్మణ్‌బాబు, సమన్వయకర్తగా పి.శ్రీనివాసులు, ఉపసమన్వయకర్తగా ఎస్.వెంకటరెడ్డి, సలహాదారుగా ఎస్.వేణుగోపాల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎ.ఆర్.కె.రెడ్డి, ఎస్.శ్రీనివాసులు, పుల్లయ్య, ఎస్.పోలయ్య, వెంకటయ్య, బి.జంగలయ్య, పి.గురువారెడ్డి, డి.శ్యాంసన్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో చైర్మన్ అంకన్న మాట్లాడుతూ గిద్దలూరు ప్రాంతంలో కేంద్రీయ పాఠశాల, ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు, ఈసీహెచ్ఎస్‌కు శాశ్వత భవనం కోసం పోరాటం చేయాలని తీర్మానించారు. నంద్యాల రోడ్డులో ఏర్పాటు చేసిన మాజీ సైనికుల కార్యాలయం బిల్డింగ్ నిర్మాణం నిలిచిందన్నారు. కానీ కొంతమంది సభ్యులు సొంత భవనం లాగా భావించడంతో, వచ్చిన రూ.50లక్షల విరాళాలకు సరైన చూపకపోవడం సమావేశంలో సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళలకు జీవనోపాధులు ఏర్పాటు

● ఎర్రగొండపాలెం క్లస్టర్ ప్రత్యేక అధికారి కృపారావు

పెద్దదోర్నాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరంలో పొదుపు సంఘాల మహిళలకు జీవనోపాధులు ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని ఎర్రగొండపాలెం క్లస్టర్ ప్రత్యేక అధికారి కృపారావు అన్నారు. మండలంలోని ఎగువచెర్లోపల్లి క్లస్టర్‌లోని ఎస్‌హెచ్‌జీ ఎన్యుమరేటర్స్, వీవోఏలకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృపారావు మాట్లాడుతూ జీవనోపాధులు పెంపొందించుకోవడం, కుటుంబ అవసరాలకు కావలసిన రుణాన్ని పొందడం వినియోగించుకుని తిరిగి చెల్లింపులు తదతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకిరెడ్డి, సీసీ ఆశీర్వాదం, మోహన్, శ్రీను అకౌంటెంట్ మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు-టిప్పర్ ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు ముందు భాగం

గిద్దలూరు టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శింగంపల్లె వద్ద గురువారం ఉదయం ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. గిద్దలూరు డిపోకు చెందిన ఆర్టీసి బస్సు మైదుకూరు వెళుతుండగా శింగంపల్లె వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొన్నది. బస్సు ముందు భాగం అద్దాలు పగిలిపోయి దెబ్బతిన్నది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశుపోషకులకు నష్టపరిహారం అందజేత



చెక్కులను పశుపోషకులకు అందజేస్తున్న అటవీశాఖ అధికారులు

మార్కాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల బారినపడి మృతిచెందిన పశువులకు సంబంధించిన యజమానులకు గురువారం అటవీశాఖ అధికారులు నష్టపరిహారం అందజేశారు. గొట్టిపడియ, గుండంచెర్ల బీట్‌ల పరిధిలోని మొత్తం ఏడుగురు పశుపోషకులకు మొత్తం రూ.2,48 లక్షలను పరిహారంగా అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాజు మాట్లాడుతూ అడవిలోని వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టవద్దన్నారు. అటవీ సంరక్షణకై అధికారులకు సహకరించాలన్నారు. వన్యప్రాణుల వలన పశువులు గాయపడిన, చనిపోయినా అటవీశాఖాధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో గుండంచర్ల బీట్ ఆఫీసర్ టి.బాలాకుమారి, జమ్మనపల్లి వీఎస్ఎస్ చైర్‌పర్సన్ వెన్నా శేషిరెడ్డి, బాధిత పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.

ముఖాముఖి

రెవెన్యూ కార్యక్రమాలకు విశేష స్పందన

ఎం.శ్రావణ్‌కుమార్, తహసీల్దార్, దర్శి



ప్రశ్న: రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారు?

జవాబు: మండలంలో మొత్తం 308 అర్జీలు రాగా, 296 పరిష్కరించాం. మిగిలిన 12 అర్జీల పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయం కోసం పంపించాం.

ప్ర: దర్శి పట్టణంలో ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం ఎలా జరుగుతుంది?

జ: ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఇప్పటికీ మూడు వార్డుల్లో కార్యక్రమం నిర్వహించాం. 203 అర్జీలు రాగా 58 పరిష్కారమయ్యాయి. అధిక శాతం మంది నివేశ స్థలాలు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేశారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పుడు కొత్త రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు ఇస్తాం. సాధారణ సమస్యలన్నింటిని పరిష్కరిస్తున్నాం.

ప్ర: జీరో ఖాతాల్లో చేరిన భూములకు మోక్షం ఎప్పుడు?

జ: మండలంలో ఎనిమిది వేల ఎకరాలు జీరో ఖాతాల్లో పొరపాటున పడింది. ఇప్పటికే సుమారు వెయ్యి ఎకరాల భూములను జీరో ఖాతాల నుంచి విడుదల చేయించాం. రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిగిలిన భూములను తీయించేస్తాం.

ప్ర: ప్రభుత్వ భూముల ఆక్రమణల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు. ఆక్రమించిన వారిపై త్వరలో చర్యలు తీసుకుంటాం. ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు త్వరలో అమల్లోకి వస్తుంది. ఆ చట్టం రాగానే ఆక్రమణల భూములన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ప్రభుత్వ భూములకు కంచెలు వేసి రక్షణ కల్పిస్తాం.

సమస్యల సత్వర పరిష్కారానికి 'ఇంటింటికి రెవెన్యూ'

దర్శి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం చేపట్టిందని తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్ తెలిపారు. దర్శి పట్టణంలోని 4వ వార్డులో గురువారం ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకోస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈసదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో షబ్బేఖదర్

పామూరు, మార్చి 27: దొనకొండలో గురువారం రాత్రి భక్తి శ్రద్ధలతో ముస్లింలు షబ్బే ఖదర్ నిర్వహించారు. ఖురాన్‌లోని 30వ పేరా 97వ సూరాలో ఐదు ఆయత్‌లు షబ్బేఖదర్ రాత్రి విశిష్టతను తెలియజేస్తున్నాయి. ఆ ఒక్కరాత్రి ప్రార్థన చేయడం వల్ల వెయ్యి రాత్రుల పుణ్యఫలం లభిస్తుందని పవిత్ర హదీసులు బోధిస్తున్నాయి. గురువారం రాత్రంతా ముస్లింలు మసీదుల్లో జాగారం చేసి తమ తప్పులను క్షమించాలని సన్మార్గంలో నడిపించాలని కోరుకుంటూ అల్లాహ్‌ను ప్రార్థించారు. షబ్బేఖదర్ రాత్రి దైవదూతలు దివి నుంచి భూమి మీదకు వస్తారని పవిత్ర ఖురాన్ గ్రంథం చెబుతున్నదని మత గురువులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులకు ముగిసిన శిక్షణ

పామూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెత్త నుంచి సంపద తయారి కేంద్రాంలో గత వారం రోజులుగా పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రులకు జరుగుతున్న శిక్షణ గురువారంతో ముగిసింది. చివరి రోజు పీసీపల్లి మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్పీ రాఘవులు మాట్లాడుతూ గ్రామాల్లోని వీధులన్నీ శుభ్రంగా ఉంచడంలో కార్యదర్శులదే బాధ్యత అని చెప్పారు. అనంతరం చెత్త సంపద తయారీ కేంద్రంలో తడి, పొడి చెత్తను గ్రేడింగ్ చేస్తున్న విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో పామూరు, పీసీపల్లి ఈవోపీఆర్డీలు జీవీ అరవిందారెడ్డి, మల్లేశ్వరి, కార్యదర్శి కృష్ణమూర్తి, జి.రత్నకుమార్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వసతి గృహ మరమ్మతు పనులు

పామూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ వసతి గృహంలో మరమ్మతు పనులు చేపట్టినట్టు సమగ్ర శిక్ష ఏఈ ప్రకాష్ తెలిపారు. ఇందుకోసం సాంఘిక సంక్షేమ శాఖ నుంచి రూ.18 లక్షల 50 వేలు మంజూరయ్యాయి. ఈనిధులతో వివిధ పనులు చేస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు ఏఈ తెలిపారు.

'ఉపాధి'లో పంచ ప్రాధాన్యాలు

- 15 రోజుల్లో 1470 నీటితొట్ల నిర్మాణాలు
- భూగర్భ జలాలు పెంపుదలే లక్ష్యంగా కుంటలు
- చెరువుల్లో పూడికతీతకు చర్యలు
- డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్



మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

దొనకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో వచ్చే మూడు నెలల్లో ఐదు రకాల పంచ ప్రాధాన్యాలే లక్ష్యంగా పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు జిల్లా డ్వామా ప్రాజెక్టు అధికారి జోసఫ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయాన్ని సందర్శించేందుకు గురువారం విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాలకు నీటి సౌకర్యం ఉండేలా నిర్దేశించిన లక్ష్యం మేరకు రానున్న 15 రోజుల్లో 1470 నీటితొట్ల నిర్మాణాలు జరిగేలా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఒక్కో నీటితొట్టి నిర్మాణానికి రూ.30 వేల వ్యయంతో నాలుగు వేల లీటర్ల నీటి సామర్థ్యం ఉండేలా పెద్దఎత్తున నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. నిర్మాణాల అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖల పర్యవేక్షణలో నీటితొట్లలో మూగజీవాలకు నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపడతారన్నారు.

రెండవ ప్రాధాన్యతగా రైతుల పొలాల్లో పడిన వర్షపు నీటిని కుంటల్లోకి మళ్లించి, ఆనీటితో పంటల ను సంరక్షించాలని తలపెట్టినట్టు చెప్పారు. తద్వార భూగర్భజలాలను పెంపొందించుకోవటమే లక్ష్యంగా రైతుల పొలాల్లో నీటినిల్వ కుంటలు(ఫాంపండ్స్) నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు.

మూడవ ప్రాధాన్యతగా గ్రామాల్లో చివరి ఆయకట్టు పొలాలకు నీరు చేరుకునేలా చెరువులు, కుంటలలో, వాగులు, వంకలలో పూడికతీత తొలగింపే లక్ష్యంగా ఫీడర్ ఛానల్‌లో పూడికతీత చేపడుతున్నట్టు చెప్పారు.

నాల్గవ ప్రాధాన్యతగా గ్రామాల్లోని చెరువులు కనుమరుగవుతున్న నేపథ్యంలో గ్రామానికి ఒక చెరువు అనే లక్ష్యంతో చెరువుల పునరుద్ధరణ పనులు చేపడుతున్నామన్నారు. చెరువుల్లో పూడికతీత, కట్టల బలోపేతం వంటి పనులు చేపట్టి రైతులకు నీటి సౌకర్యం కల్పించనున్నట్టు చెప్పారు.

ఐదో ప్రాధాన్యతగా ఉపాధి పనులు చేపట్టే కూలీలకు కనీస సగటు వేతనం రూ.300 ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇందులోభాగంగా గ్రూప్ మార్కింగ్ ఇచ్చి కొలతల ప్రకారం కనీసం నాలుగు గంటలు పనిచేయాలన్నారు. పని కోరుకునే వారిలో కనీసం 1/3 వంతు గడ్డపారలను తెచ్చుకొని పనులు చేసుకునేలా చర్యలు చేపడుతున్నట్టు జోసఫ్‌కుమార్ వివరించారు.

ఈసందర్భంగా ఉపాధి సిబ్బంది జోసఫ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి అనేక విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఆదాం షఫీ, ఏపీడీ నిర్మలాదేవి, ఏపీవో టి.దేవయ్య, ఈసీ రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి రూ.17 కోట్లతో ప్రతిపాదనలు

- నిధుల మంజూరుకు మంత్రి హామీ
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వెల్లడి



మంత్రి నారా లోకేష్‌ను కలిసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్

దర్శి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాల నిర్మాణాలకు నిధులు విడుదల చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. గురువారం మంత్రిని క్యాంపు కార్యాలయంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ ప్రాజెక్టులను వివరించారు. నాలుగు సంవత్సరాల క్రితం దర్శిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభమైందని తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ఒక భవనంలో అరకొర వసతులతో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పూర్తిస్థాయిలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య కూడా ఆశించిన మేరకు పెరగలేదు. దర్శికురిచేడు రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం ఆరు ఎకరాల భూమి కేటాయించారన్నారు. అక్కడ భవనాలు నిర్మాణానికి రూ.17 కోట్లు విడుదల చేయాలని ప్రతిపాదనల ప్రతులను మంత్రికి అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ వీలైనంత త్వరలో నిధులు విడుదల చేస్తానని అంగీకరించినట్లు వారు తెలిపారు.

అలాగే, జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం పునర్నిర్మాణం, అన్నా క్యాంటిన్ నిర్వాహణకు నిధులు విడుదల చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చుతామని మంత్రి భరోసా ఇచ్చినట్లు వారు తెలిపారు. అందర్ని కలుపుకొని సమిష్టిగా ముందుకు పోవాలని మంత్రి లోకేష్ సూచించినట్టు డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమంలో అర్హులందరికీ అందేలా కృషిచేయాలని సూచించారని ఆమె తెలిపారు.

అసంపూర్తిగా పాఠశాలల భవనాలు

- గత వైసీపీ ప్రభుత్వంలో నాడు- నేడు కింద చేపట్టిన పనులు
- పూర్తికాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



పెదఉల్లగల్లులో అసంపూర్తిగా పాఠశాల భవనం

ముండ్లమూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాడు- నేడు కింద గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన పాఠశాలల భవవ నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడతున్నారు. 2022లో నాడు - నేడు ఫేజ్ - 2 కింద 29 స్కూళ్ళకు అదనపు గదులతో పాటు 19 రకాల అవసరాల కోసం సమగ్ర శిక్ష నిధులు రూ.9.50 కోట్లు మంజూరయ్యాయి. 29 పాఠశాలలకు గాను పది స్కూళ్ళల్లో భవనాలు, మరో 19 పాఠశాలల్లో వివిధ రకాల పనులైన పెయింటింగ్, ప్రహరీ గోడలు, తాగు నీటి ట్యాంకులు, వంట గదులు, కాంపౌండ్ వాల్ లాంటి పనులు చేపట్టాల్సి ఉంది. అయి తే, ప్రభుత్వం మొదటి విడతలో రూ.నాలుగు కోట్లలోపే నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో అదనపు గదులతో పాటు కొన్ని చిన్న చిన్న పనులు చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన నిధులు అయిపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు అరకొరగా పనులుచేసి వదిలి వేశారు. నిధులు వస్తేనే పనులు చేస్తామని చెప్పారు. దీంతో చేసేదేమి ఉపాధ్యాయులు మిన్నకుండి పోయారు. విద్యార్థులకు చాలినన్ని గదులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, వంట గదులు, కాంపౌండ్ వాల్ లేక ఇబ్బందులు పడుతున్నారు.



పసుపుగల్లులో అసంపూర్తిగా ప్రాథమిక పాఠశాల భవనం

ప్రధానంగా ముండ్లమూరులోని కేజీబీవీ పాఠశాల, పెదఉల్లగల్లులోని యూపీ పాఠశాల, పసుపుగల్లులోని ప్రాథమిక పాఠశాల మెయిన్, సింగనపాలెం యూపీ పాఠశాల, వేముల జడ్పీ ఉన్నత పాఠశాల, మారెళ్ళ జడ్పీ ఉన్నత పాఠశాల, శంకరాపురం యూపీ పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సకాలంలో నిధులు విడుదలచేసి భవనాలను పూర్తిచేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి నిధులు మంజూరుచేసి అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తిచేయడంతోపాటు మిగతా సౌకర్యాలు కల్పించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

సస్పెండ్ అయిన ఉపాధ్యాయుడిపై విచారణ

కురిచేడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర నాయుడుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు కరిముల్లా విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించటంతో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గతంలో విధుల నుంచి తొలగించారు. సదరు ఉపాధ్యాయుడిపై గురువారం ఒంగోలు ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వరరావు పాఠశాలలో విచారణ చేపట్టారు.

పాఠశాల గేటుకు తాళాలు వేసి అంత ర్గత విచారణ చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి లిఖితపూర్వకంగా జవాబులు తీసుకున్నారు. విచారణ నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి పంపను న్నట్లు చంద్రమౌళీశ్వరరావు తెలిపారు.



ఉపాధ్యాయులను విచారిస్తున్న డిప్యూటీ ఈవో చంద్రమౌళీశ్వరరావు

గ్రామస్థుల ఆగ్రహం

పాఠశాల తలుపులు మూసి అంతర్గత విచారణ చేపట్టడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదులు ఇచ్చిన తమను లోపలకు అనుమతించకపోవటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడి సమక్షంలోనే విద్యార్థులు, ఉపాధ్యాయులతో విచారణ చేయటం ఏమిటని ప్రశ్నించారు. విచారణాధికారి తమ ను మాటమాత్రం కూడా అడగలేదన్నారు. ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కరిముల్లాను విధుల నుంచి డిస్మిస్ చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

రహదారులపై విద్యుత్ స్తంభాలు

- పొంచిఉన్న ప్రమాదం

ముండ్లమూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో ని పలు ప్రధాన వీధుల్లో రహదారుల మధ్య విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. దీంతో ఆవీధుల్లోని ప్రజలు ఏరూపంలో ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. బస్టాండ్ సెంటర్ నుంచి చింతలపూడి వెళ్ళే ప్రధాన రహదారిపై రెండు విద్యుత్ స్తంభాలు ఉన్నాయి.

ఎస్టీ కాలనీకి వెళ్ళే రహదారి మధ్యలో విద్యుత్ స్తంభం ఉంది. రహదారి పక్కనే ట్రాన్స్‌ఫారం కూడా ఉంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వీటిని తొలగించి రహదారుల పక్కన ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఎస్టీ కాలనీకి వెళ్ళే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

దర్శి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వై.రామారావు హెచ్చరించారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగులకు పాల్పడే అవకాశం ఉందనే ఉద్దేశంతో గురువారం సాయంత్రం పలుప్రాంతాల్లో తనిఖీలు చేశారు. టీస్టాల్స్, టిఫన్ సెంటర్స్ కళాశాలల ప్రాంగాణాల్లో తనిఖీలు నిర్వహించి పలువురు యువకుల సెల్‌ఫోన్లు తనిఖీలు చేశారు. ఈ సం దర్భంగా సీఐ మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న యువత చెడు వ్య స నాలకు బానిసలు కావద్దన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగులతో ఎన్నో కుటుంబాలు చితికిపోయాయన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



యువకుల వద్ద సెల్‌ఫోన్‌లను పరిశీలిస్తున్న సీఐ రామారావు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాలనారాయణ

కనిగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎరజాల బాలనారాయణ ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎన్నికల్లో అచ్చాల ఆదినర్సారెడ్డిపై అత్యధిక ఓట్లతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా షాహిద్ మహ్మద్, కార్యదర్శిగా బుల్లా ప్రపుల్లకుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నంబుల నాగరాజు, కంచర్ల శ్రీనివాసులు గెలుపొందారు. కోశాధికారి పదవికి షేక్ మీరావలి, ఎస్ మాలకొండారెడ్డిలకు సమానంగా ఓట్లు రావటంతో ఏడాదిలో చెరి ఆరు నెలలు ఉండేలా కమిటీ తీర్మానం చేసింది. ఎన్నికల ప్రక్రియను చింతగుంట్ల సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో జరిగాయి. ఈసందర్భంగా బాలనారాయణ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఈశ్రమ్ కార్డు పొందాలి

కనిగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రోజువారీ కూలీ పనులు చేస్తున్న కార్మికులు తప్పనిసరిగా ఈశ్రమ్ కార్డు పొందాలని కార్మిక శాఖాధికారి సుబ్బారాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈఅవకాశాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఇఫ్తార్ విందులో స్వయంగా వడ్డిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఉగ్ర ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

కనిగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా భక్తిశ్రద్ధలతో ఉపవాసదీక్షలో ఉన్న ముస్లింలకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి గురువారం రాత్రి స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ప్రత్యేక దువ నిర్వహించి అనంతరం ఇఫ్తార్ విందు చేశారు. ఎమ్మెల్యే స్వయంగా వారికి ఆహారాన్ని వడ్డించారు. పెద్దఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

రంజాన్‌కు ముస్తాబైన ఈద్గా



దొనకొండలో ముస్తాబైన ఈద్గా

దొనకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు ఈనెల 31న రంజాన్ పర్వదిన వేడుకలు జరుపుకునేందుకు సంసిద్ధమవుతున్నారు. ఈసందర్భంగా మూకుమ్మడిగా ఈద్గా వద్దకు చేరుకొని సామూహిక ప్రార్థనలు చేస్తారు. ఎస్‌పీ శాఖలో పనిచేస్తున్న షేక్ మహమ్మద్ హనీఫ్ దొనకొండలోని ఈద్గాకు సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. ఈసందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

శీలంవారిపల్లిలో క్రికెట్ టోర్నమెంట్

సీఎస్‌పురం(పామూరు) మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి గ్రామంలో ఏప్రిల్ 1 నుంచి 7వ తేది వరకు ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50,116, ద్వితీయ బహుమతి రూ.30,116, తృతీయ బహుమతి రూ.20,116 అందజేయనున్నట్లు తెలిపారు. ఈనెల 31లోగా రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేర్లు నమో దు చేయించుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9493355202, 7013898748, 6362367650 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

చేతివృత్తుల కిట్లు మంజూరు

పామూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద 18 రకాల చేతివృత్తుల వారికి మంజూరైన పనిముట్లను గురువారం పోస్ట్‌మాస్టర్ తిరుపాలు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య పంపిణీ చేశారు. దరఖాస్తులు చేసుకొన్న వారికి వృత్తిపరమైన శిక్షణ ఇచ్చి పనిముట్లు అందజేశారు. కార్యక్రమంలో పోస్ట్‌మన్ కుక్కల రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తాళ్లూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భవించి ఈనెల 29వ తేదీనాటికి 43 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి గ్రామంలో టీడీపీ జండాలను ఆవిష్కరించాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి గురువారం తెలిపారు. గ్రామపార్టీ అధ్యక్షులు దిమ్మెలు ఏర్పాటుచేసి జండాలను ఆవిష్కరించాలన్నారు. అన్ని గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన తాళ్లూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరుగనున్న ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, యువనాయకుడు లలిత్‌సాగర్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మల్లికార్జున్ (ఫైల్)

పీసీపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల వాసి మృతిచెందాడు. మండలంలోని కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన కల్లూరి మల్లికార్జున్(32) మహారాష్ట్ర నుంచి కమలాకాయల లోడుతో వస్తున్నాడు. ఈక్రమంలో డీసీఎం వ్యాన్‌ను బండి యజమాని నరసింహారెడ్డిని డ్రైవింగ్ చేయమని మల్లికార్జున్ నిద్రపోయాడు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మన్నూర్ వద్ద జాతీయరహదారిపై సమీపంలో ముందువెళుతున్న సిమెంట్ లోడు లారీని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో వాహనంలో ఎడమవైపు నిద్రిస్తున్న మల్లికార్జున్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనాన్ని నడుపుతున్న నరసింహారెడ్డికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మల్లికార్జున మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. గాయపడిన నరసింహారెడ్డి వైద్యశాలలో చికిత్సపొందుతున్నాడు. మల్లికార్జున్ మృతిచెందాడన్న విషయం తెలియడంతో కుటుంబసభ్యులు బోరున విలపిస్తుండడంతో కమ్మవారిపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి తల్లి, ఇద్దరు సోదరీలు ఉన్నారు.

బైకుపై నుంచి పడి వ్యక్తి మృతి

తాళ్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పొలం పనులకు మోటార్ సైకిల్‌పై వెళ్లి తిరిగివస్తూ రైతు మృతిచెందాడు. ఈఘటన బుధవారం మండలంలోని వెలుగువారిపాలెంలో చోటుచేసుకుంది. ఇందుకుసంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదయింది. గ్రామానికి చెందిన మూలంరెడ్డి వెంకటేశ్వర్లు మోటారుసైకిల్‌పై బుధవారం సాయంత్రం పొలం పనులకు వెళ్లాడు. రాత్రి వేళ ఇంటికి తిరిగి వస్తుండగా జారిపడి కిందపడ్డాడు. ఈప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వెంకటేశ్వర్లు రాత్రి ఇంటికి రాకపోవటంతో కుటుంబీకులు తిరునాళ్లకు వెళ్లాడన్న ఆలోచనతో మిన్నకున్నారు. ఉదయం మృతుని భార్య కోటేశ్వరమ్మ పొలంకు వెళ్లగా మోటార్‌సైకిల్ కిందపడి మృతిచెంది ఉన్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుని భార్య, నలుగురు సంతానం ఉన్నారు.

దొనకొండలో నిరసన ర్యాలీ

దొనకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ మరణం తెలుగు రాష్ట్రాల క్రైస్తవులకు తీరనిలోటని దొనకొండ ఏబీఎం చర్చి సంఘకాపరి రెవరండ్ పాస్టర్ డి.ప్రభుదాస్ పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపంగా ఏబీఎం చర్చి కమిటీ సభ్యులు, సంఘస్తులు, సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు గురువారం రాత్రి క్యాండిల్స్ వెలిగించి దొనకొండ పుర వీధుల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ కూడలిలో మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

ముండ్లమూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించుకొని పంటలు సాగు చేసుకోవాలని ఏడీఏ బాలాజీ నాయక్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని పసుపుగల్లు లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి రైతు తమ పొలాన్ని పరీక్ష చేయించుకున్నట్లయితే ఏ పంట సాగుచేస్తే ఎంత దిగుబడి వస్తుందో తెలుసుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.





ఖాళీ ప్లాట్లపై కుస్తీ

- స్థలాలిచ్చి.. నిర్మాణంపై మడమ తిప్పిన గత ప్రభుత్వం
- ఇళ్లు కట్టుకోలేక ఖాళీగా వదిలేసిన పలువురు లబ్ధిదారులు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 27,283 ప్లాట్లు ఖాళీ
- ఇళ్ల మధ్యలో స్థలాలతో సమస్యాత్మకంగా సర్దుబాటు

కష్టతరంగా జగనన్న కాలనీల్లోని స్థలాల సర్దుబాటు

కాలనీలు కాదు ఊళ్లు నిర్మిస్తున్నాం.. స్థలాలే కాదు ఇళ్లు కూడా కట్టిస్తాం.. సకల సౌకర్యాలతో పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం.. అని గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో లే అవుట్లు వేసి లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేసింది. అయితే అప్పట్లో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంపై మాటమార్చింది. దీంతో పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఇలాంటి ఖాళీ ప్లాట్లు జగనన్న కాలనీలోని ప్రతీ లేఅవుట్లో వందల్లో ఉన్నాయి. ఖాళీ ప్లాట్లపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర ప్లాట్లు 27,283 ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి పంపిణీకి ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీచేసింది. అయితే ఇళ్ల మధ్య.. ఊళ్లకు దూరంగా.. కనీస సౌకర్యాలు లేని.. చిట్టడవులను తలపిస్తోన్న.. వర్షం పడితో చెరువుల్లా మారే లేఅవుట్లలోని ప్లాట్లను ఏమి చేయాలో.. ఎలా సర్దుబాటు చేయాలనే విషయంపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు పేరుతో పేదల కోసం అంటూ జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి స్థలాలను పంపిణీ చేసింది. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున స్థలాలు కేటాయించింది. అయితే ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు ముందుకు రాలేదు. కొందరు స్తోమతకు మించి అప్పులు చేసినా ఇళ్లను పూర్తిగా నిర్మించుకోలేక వదిలేశారు. దీంతో ఆయా కాలనీలు మొండిగోడలకు పరిమితమైన ఇళ్లు, పునాదుల దశలోనే ఉన్న ఇళ్లు.. అసలు నిర్మాణాలకే నోచుకోని ఖాళీ స్థలాలతో జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. అరకొర నిర్మాణాలతో ఉన్న ఇళ్లను పక్కన పెట్టి ప్రస్తుతానికి ఖాళీ స్థలాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే ఆ ఖాళీ స్థలాల సర్దుబాటు ప్రక్రియ అటు ప్రభుత్వానికి ఇటు రెవెన్యూ అధికారులకు కొత్త తలనొప్పులు తెచ్చి పెడుతోంది. ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలను, సగం నిర్మాణాలున్న స్థలాలను ఎలా సర్దుబాటు చేయాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు. దీంతో స్థలాల సర్దుబాటు వ్యవహారం ఒక ప్రహసనంగా మారుతోంది. మొత్తంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 27,283 ఖాళీ స్థలాలు ఉన్నాయి. జగనన్న లేఅవుట్లలో ఖాళీగా పడి ఉన్న స్థలాలను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున పేదలకు స్థలాలను సర్దుబాటు చేయాల్సిందిగా రెవెన్యూ శాఖను ఆదేశించింది. అయితే ఆ ప్రకారం సర్వే చేస్తున్న అధికారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఒక లే అవుట్లో కొంత మంది ఇళ్లు కట్టుకుంటే.. మరికొందరు ఇళ్లు కట్టుకునే స్తోమత లేక ప్రభుత్వ సహాయం అందక ప్లాట్లను ఖాళీగా వదిలేశారు. అలా వదిలేసిన స్థలాలు చాలా వరకూ ఇళ్ల మధ్యలో ఉన్నాయి. ఈ సాంకేతిక సమస్య కారణంగా ప్రభుత్వం చెప్పిన 2, 3 సెంట్లు చొప్పున సర్దుబాటు చేసేందుకు వీలుపడడం లేదు. మరోవైపు ఆ స్థలాలనే వేరొకరికి ఇద్దామంటే, ప్రభుత్వం ప్రకటించిన స్థలాల కంటే చిన్నవి కావడంతో వాటిని తీసుకోవడానికి ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఆయా ఖాళీ ప్లాట్లను ఏమి చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సర్దుబాటు వ్యవహారం ఎప్పటికి కొలిక్కి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

కట్టుకోలేక వదిలేశారు

గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో స్థలాలు ఇచ్చి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రూ.1.80 లక్షలతో ఇల్లు కట్టుకోవాలని సూచించింది. రాష్ట్రం వాటా కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఆ డబ్బుతో ఇళ్లు కట్టుకోలేక నిరుపేదలు అనేక మంది స్థలాలను ఖాళీగా వదిలేశారు.

- గుంటూరు జిల్లాలో 247 లేఅవుట్లలో 73,932 ప్లాట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 63,823 ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా,శంకుస్థాపనకు నోచుకోకుండా 10,109 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వం వేసిన జగనన్న కాలనీల్లోని లే అవుట్లలో 29,854 మందికి ప్లాట్లు ఇచ్చారు. అయితే 10,500 మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేక వదిలేశారు.
- పల్నాడు జిల్లాలో 39,642 ప్లాట్లు వేసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అయితే 9,481 ఇళ్లు పునాదుల దశలోనే ఉన్నాయి. 6,674 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాకపోవడంతో ఖాళీగా ఉన్నాయి.

లబ్ధిదారులకు రూ.50 వేలు

ఇళ్ల పనులు ప్రారంభించి మధ్యలో వదిలేసిన స్థలాలను సర్దుబాటు చేసే అవకాశం లేకపోవ డంతో లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.50 వేల సహాయాన్ని ప్రకటించింది. గుంటూరు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు 14,112 మందికి, బాపట్ల జిల్లాలో 15,334 మందికి, పల్నాడు జిల్లాలో 14,106 మందికి అదనపు ఆర్థిక సహాయం చేయనుంది.



అదనపు సహాయంతో ప్రోత్సాహం

నిర్మాణం మొదలైన స్థలాలను సర్దుబాటు చేయడం వీలుకాని నేపథ్యంలో ప్రభుత్వం లబ్ధిదారులకు అదనపు సహాయం ప్రకటించి ఆ ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా చేయూత ఇస్తుందని ఆశతో గతంలో మొదలుపెట్టిన అనేకమంది ఇళ్లు కట్టుకోలేక మధ్యలో ఆపేశారు. గుంటూరు జిల్లాలో 51,579 ఇళ్లు ఇంకా పూర్తి కావాల్సి ఉండగా 34,527 ఇళ్లు పునాదుల దశలోనే ఉన్నాయి. బాపట్ల జిల్లాలో సొంత స్థలాలున్న 20 వేల మందితో కలిపి 50,457 ఇళ్లు నిర్మించ తలపెట్టగా వాటిలో 32 వేలు అసంపూర్తిగా ఉన్నాయి. అందులో సగం జగనన్న కాలనీల్లోనే ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 23,852 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. అయితే గతంలో గృహ రుణం మంజూరై ఇళ్లు నిర్మించుకోకుండా ఖాళీగా వదిలేసిన స్థలాలకు ప్రస్తుత ప్రభుత్వం అందజేసే సర్దుబాటు వర్తించదని అధికారులు చెబుతున్నారు.



అధ్వాన స్థితిలో నరసరావుపేటలోని కలెక్టరేట్ పక్కన ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం

నిధులున్నా.. మరమ్మతులు మమ

- ఎస్సీ వసతిగృహాల నిర్వహణపై నిర్లక్ష్యం
- మూడు నెలల క్రితం రూ.11.43 కోట్లు విడుదల
- పల్నాడు జిల్లాలో దారుణంగా పనుల తీరు
- గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అరకొరగానే..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రూపురేఖలు కోల్పోయిన మరుగుదొడ్లు.. పెచ్చులు ఊడు తున్న శ్లాబ్‌లు.. మెష్‌లు లేని కిటికీలు.. తలుపులు లేని గదులు.. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దోమల మధ్య.. ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు అల్లాడుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ హాస్టళ్ల నిర్వహణను గాలికి వదిలేశారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించేందుకు హాస్టళ్లలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించింది. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు వసతిగృహాల్లో సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి నిధులు విడుదల చేసింది. అయితే సదరు పనులు చేపట్టడంలో అధికారుల్లో అడుగడుగునా అలసత్వం తాండవిస్తోంది. నిధులు ఉన్నా మరమ్మతులు పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. మూడు నెలల క్రితమే నిధులు విడుదలైనా నేటికి చాలా దగ్గర్ల పనులు చేపట్టలేదంటే అధికారుల అలసత్వం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నా పట్టించుకోవడంలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని 53 వసతి గృహాల్లో మరమ్మతులకు రూ.11.43 కోట్లు నిధులు విడుదలయ్యాయి. అయితే చాలా చోట్ల పనులు చేపట్టలేదని సాంఘిక సంక్షేమశాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. పల్నాడు జిల్లాలో 16 వసతి గృహాలకు నిధులు కేటాయించినా ఒక్క దగ్గర కూడా పనులు పూర్తి చేయలేదు. గుంటూరు జిల్లాలో 23 వసతి గృహాలకు చాలా వసతిగృహాల్లో 50 శాతం పనులే జరిగాయి. బాపట్ల జిల్లాలో అన్ని వసతి గృహాల్లో పనులు చేపట్టగా మూడు చోట్ల 25 శాతం లోపు, 11 వసతి గృహాల్లో 50 శాతం లోపు పనులు జరిగాయి. పనులు జరుగుతున్న తీరు పరిశీలిస్తే ఇప్పట్లో అవి పూర్తయ్యే పరిస్థితి లేదని అర్థమవుతోంది. జూన్‌లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో అప్పటి కల్లా మరమ్మతులు పూర్తి చేసేందుకు అధికారులు స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లా	వసతి గృహాలు	నిధులు (రూ.కోట్లలో)
పల్నాడు	16	2.76
గుంటూరు	23	4.13
బాపట్ల	14	4.54

సూర్యలంకకు మహర్దశ



- బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు
- అంతర్జాతీయ ప్రమాణాలతో సొబగులు
- బీచ్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి
- 45 రోజుల్లో నిధులు.. కేంద్రానిదే పూర్తి బాధ్యత : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

సమకూరే వసతులు..

- బ్లూఫ్లాగ్ గుర్తింపు దక్కేలా వసతుల కల్పన
- కొత్తగా రిసార్టుల నిర్మాణం, తాత్కాలిక గదుల ఏర్పాటు
- పర్యాటకులను ఆకర్షించేలా బీచ్ ఆధునికీకరణ
- దేశీయ సాంప్రదాయ ఫుడ్ స్టాళ్లు, షాపింగ్ స్ట్రీట్ ఏర్పాటు
- పిల్లలకోసం ప్రత్యేక ఆట వస్తువులు, పార్కు నిర్మాణం

బాపట్ల, గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సుందరమైన సూర్యలంక బీచ్ అత్యాధునికంగా.. సకల సౌకర్యాలతో.. పర్యాటకులను మరింత ఆహ్లాదప రచనున్నది. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద సూర్యలంక బీచ్ అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక సొబగులు అద్దుకోనుంది. బీచ్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టు కింద సూర్యలంక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ.97.52 కోట్లు మంజూరు చేసింది. సూర్యలంక బీచ్‌కి సంబంధించి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేకంగా దృష్టి సారించి 45 రోజుల్లోనే నిధులు సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. ఫిబ్రవరిలో కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాసిన పెమ్మసాని పలుమార్లు ఆయనను వ్యక్తిగతంగా కలిసి ఈ ప్రాజెక్టుకు సంబంధించి వివరాలు అందజేసి నిధులు రాబట్టడంలో విజయం సాధించారు. కేంద్రం విడుదల చేసిన నిధులను 7 అంశాలపై ఖర్చు చేయనున్నారు. రూ.15.43 కోట్లతో పర్యాటకుల అనుభూతిని పెంచేలా కార్యక్రమాలు, రూ.4.4 కోట్లతో షాపింగ్ స్ట్రీట్, రూ.7.8 కోట్లతో రవాణా సదుపాయాలు, రూ.11.69 కోట్లతో బీచ్ సమీపంలోని కాల్వ అభివృద్ధి, రూ.19.4 కోట్లతో ఎక్స్‌పీరియన్స్ జోన్, రూ.12.8 కోట్లతో సదుపాయాలు, రూ.5.97 కోట్లతో సౌకర్యాలు అందుబాటులోకి తేనున్నారు. సూర్యలంకకు ప్రాజెక్టు మంజూరు చేయించడం తనకు చాలా ఆనందంగా ఉందని పెమ్మసాని గురువారం తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

చక్రం తిప్పిన పెమ్మసాని..

స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద కేంద్రం తొలుత రూ.600 కోట్ల బడ్జెట్‌తో దేశ వ్యాప్తంగా ఆరు ప్రాజెక్టులను చేపట్టింది. ఈ పథక నిర్వహణలో సాంకేతిక సర్దుబాట్ల బాధ్యతను పెమ్మసాని ప్రత్యేకంగా చేపట్టారు. ఈ క్రమంలో ఆరు ప్రాజెక్టులను 14 ప్రాజెక్టులుగా మార్పు చేయించారు. బడ్జెట్‌ను కూడా రూ.600 నుంచి 1,000 కోట్లకు పెంచేలా చేశారు. సూర్యలంక బీచ్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టును కూడా ఇందులో జత చేయించడంలో పెమ్మసాని చక్రం తిప్పారు. సూర్యలంక బీచ్ ప్రాముఖ్యత, పర్యాటకంగా పెరగనున్న ఆదరణ, తదితర వివరాలను సవివరంగా డీపీఆర్ ద్వారా కేంద్ర పర్యాటకశాఖకు పలుమార్లు పెమ్మసాని వివరించడంతో సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్రం నిధులను విడుదల చేసింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (శుక్రవారం సాయంత్రం)
సహరి : 4.49 (శనివారం ఉదయం)

కలెక్టర్ ఆదేశాలూ.. బేఖాతర్

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సరెండర్
- రిలీవ్‌కాని ఈఎస్.. త్రిశంకుస్వర్గంలో ఆదేశాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)



ఈఎస్ దేవదత్తు

మద్యం షాపుల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలతో పాటు సమయపాలన పాటించకుండా కొన్ని దుకాణాల్లో 24 గంటలు మద్యం అందుబాటులో ఉండడం వంటి ఫిర్యాదులపై స్పందించిన కలెక్టర్ వెంకటమురళి సీరియస్ అయ్యారు. బెల్ట్ షాపుల కట్టడిలో ఎక్సైజ్ విభాగం దృష్టి సారించడం లేదనే నివేదికలు కూడా కలెక్టర్‌కు అందాయి. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈఎస్ దేవదత్తును కలెక్టర్ గతంలో ఆదేశించారు. కానీ దేనికీ ఆయన స్పందించకపోవడంతో పాటు విధి నిర్వహణలో అలసత్వం, సమీక్షలకు హాజరుకాకపోవడం వంటి కారణాలతో ఈఎస్ దేవదత్తును కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ ఈ నెల 24న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఏఈఎస్ వెంకటేశ్వర్లుకు ఇన్‌చార్జి ఆదేశాలను కూడా కలెక్టర్ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం రిలీవ్ కావాల్సిన దేవదత్తు తాత్సారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన రిలీవ్ కాకుండానే ఏఈఎస్ మరో వైపు ఇన్‌చార్జి విధులు నిర్వహిస్తుండడంతో సరెండర్ ఆదేశాలు డోలాయమానంలో ఉన్నాయి. తానిచ్చిన ఉత్తర్వులనే ఈఎస్ బేఖాతర్ చేయడంపై కలెక్టర్ ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయమే దేవదత్తును వివరణ కోరగా సరెండర్ నోటీసులు తనకు అందాయని, కానీ కమిషనరేట్ నుంచి తనకు ఎలాంటి మౌఖిక ఆదేశాలు కానీ ఉత్తర్వులు కానీ రాలేదని అందుకే రిలీవ్ కాలేదని చెప్పారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా...

బెల్ట్ షాపుల కట్టడి, ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.కానీ జిల్లా పరిధిలోని అనేక షాపుల్లో ఈ నిబంధనలు అమలు జరగడంలేదు. బాటిల్ రూ.20 నుంచి రూ.30 వరకు పెంచి అమ్మకాలు జరుపుతున్నారు. వాటిని కట్టడి చేయడంలో ఎక్సైజ్ శాఖ వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది. నిబంధనలు పాటించని మద్యం షాపుల యజమానులపై జరిమానాలు విధించాలని, వరుసగా మూడు సార్లు ఎక్సైజ్ విభాగానికి పట్టుబడితే లైసెన్సు రద్దు చేయడానికి కూడా వెనకాడొద్దనేది ప్రభుత్వ ఆదేశాలు. నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతున్నా ఎక్సైజ్ విభాగం ఇప్పటి వరకు జరిమానా వేసిన దాఖలాలు లేవు. పైగా నాటుసారా కట్టడిలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఇవన్నీ కలిసి ఎక్సైజ్ సూపరిటెండెంట్ సరెండర్‌కు దారి తీశాయని తెలుస్తోంది.

పంచాయతీ ఉప ఎన్నికలు.. ప్రశాంతం

వైసీపీ ఖాతాలోనే పిట్టలవానిపాలెం ఎంపీపీ

మూడు ఉప సర్పంచ్‌లు టీడీపీ మద్దతుదారులు కైవసం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వివిధ కారణాలతో పంచాయతీల్లో ఏర్పడిన ఖాళీలకు గురువారం ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఓ ఎంపీపీ స్థానంతో పాటు కో ఆప్టెడ్ సభ్యుడి ఎన్నిక, నాలుగు ఉప సర్పంచ్‌ల ఖాళీలు ఇందులో ఉన్నాయి. అందరి దృష్టి కేంద్రీకృతమైన పిట్టలవానిపాలెం ఎంపీపీ స్థానాన్ని వైసీపీ చేజిక్కించుకుంది. ఎంపీపీగా పిట్టువారిపాలెం ఎంపీటీసీ దెందుకూరి సీతారామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భట్టిప్రోలు మండల పరిధిలోని కో ఆప్టెడ్ సభ్యుడిగా ఆ పార్టీ బలపరిచిన వ్యక్తే ఎన్నికయ్యారు. నాలుగు ఉప సర్పంచ్‌లకు ఎన్నిక జరగ్గా మూడు ఏకగ్రీవం కాగా ఒక చోట ఎన్నిక అనివార్యమైంది. భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ ఉపసర్పంచ్ స్థానానికి ఎన్నిక జరగ్గా టీడీపీ బలపరిచిన గొర్రెపాటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. రేపల్లె మండలంలోని పేటేరు ఉపసర్పంచ్‌గా కనికచర్ల శ్రీదేవి, చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం ఉపసర్పంచ్‌గా పెరుగు వెంకటశివనాగేశ్వరరావులను ఎన్నుకున్నారు.

చీరాలలో కార్పొరేట్ స్థాయి వైద్యం

- ఏరియా ఆస్పత్రిలో ప్రాణాంతక చికిత్సలు
- రూ.23.75 కోట్లతో 50 బెడ్లతో క్రిటికల్ కేర్ వార్డు

చీరాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చీరాల వంద పడకల ఏరియా ఆస్పత్రిలో నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటు లోకి రానున్నాయి. 12 ఎకరాల విస్తీర్ణంలోని ఆస్పత్రిలో సుమారు 50 బెడ్లతో సంబంధిత క్రిటికల్ కేర్ వార్డును ఏర్పాటు చేయనున్నారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా వైద్యులు కొరత వేధిస్తుండేది. అయితే చాలా విభాగాలకు సంబంధించిన వైద్యుల నియామకం ఇటీవల జరిగింది. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రి అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించగా ప్రస్తుతం చీరాల ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేకంగా దృష్టి సారించారు. మార్చురీలో సరైన వసతులు లేకపోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే కొండయ్య ఫ్రీజర్‌కు ఆర్థిక సాయం అందజేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఇక్కడ సరైన వైద్యం అందడంలేదని తెలుసుకున్న ఎమ్మెల్యే ఇటీవల వైద్యులు, అభివృద్ధి కమిటీతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. సామాన్యులకు, నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందాలని తీర్మానం చేశారు. ఈక్రమంలోనే సమస్యను పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన వారు ఆస్పత్రిలో అత్యాధునిక క్రిటికల్ కేర్‌ను మంజూరు చేశారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ నుంచి రూ.23.75 కోట్లను కేటాయించారు. ఈ క్రిటికల్ కేర్ వార్డు నిర్మాణం జరిగి అందుబాటులోకి వస్తే చీరాలలోనే కార్పొరేట్ స్థాయి ఆపరేషన్‌లు, ప్రత్యేక ఐసోలేషన్ వార్డు, డెలవరీస్, బోర్న్ కేర్ వంటి సేవలు పొందే అవకాశం కలుగుతుంది.

మాటలు కాదు.. అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే కొండయ్య

మాటలు చెప్పను.. అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే కొండయ్య తెలి పారు. ఆస్పత్రిలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సుమారు రూ.160 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి అందజేశామన్నారు. ఇప్పటికే సుమారు రూ.70కోట్ల మంజూరు కాగా వాటిలో చాలా వరకు పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.4.50 కోట్లు సిఫార్సు చేయగా, రూ1.30 కోట్లు పంపిణీ చేసిన ట్లు తెలిపారు. కుందేరుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. ప్రజలు ఇకపై వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం ఉండదని సూపరింటెండెంట్ డా. సుభాషిణి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన వైద్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు

సీఎం పర్యటన ఏర్పాట్లు వేగవంతం

- కొత్తగొల్లపాలెంలో 1న చంద్రబాబు పింఛన్లు పంపిణీ
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ దూడి

చినగంజాం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగంజాం పంచాయతీ ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 1వ తేదీన పేదల సేవలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను గురువారం ఎస్పీ తుషార్‌దూడీ, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ స్థలం, సభా ప్రాంగణాన్ని, పెన్షన్ల పంపిణీ లబ్ధిదారుల గృహాలను, టీడీపీ కార్యకర్తలతో నిర్వహించే సమావేశ ప్రాంతాన్ని, వీఐపీ వాహనాల పార్కింగ్ స్థలాన్ని, కాన్వాయ్ వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రచ్చబండ వద్ద అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో అధికారులు నిర్వహించాల్సిన విధులను తెలిపారు. రెండు వేల మంది ప్రజలు కూర్చోవడానికి అనుకూలంగా సభాప్రాంగణం ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా వేదిక వద్ద జీరో ప్రావర్టీ గురించి రెండు స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావును ఆదేశించారు. సుమారు నాలుగు గంటల పాటు జరిగే సీఎం కార్యక్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలు, ట్రాఫిక్ ఏర్పాట్లపై అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, చీరాల డీఎస్పీ మొయిన్, డీపీవో ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ దూడీ

దగా పడుతున్న మిర్చి రైతులు

- నకిలీ విత్తనాల వద్ద నుంచి.. ధరల వరకు అదే పంథా
- ఆరుగాలం కష్టపడినా చేతికి వచ్చేది చిల్లి గవ్వే
- కొమ్మాలపాడు పరిసర గ్రామాల రైతుల ఆవేదన

అద్దంకి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మిర్చి రైతులు అవసరాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు నిలువునా ముంచుతున్నారు. సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు పరిసర గ్రామాలలో పెద్ద ఎత్తున మిరప సాగు చేస్తుంటారు. ఆయా గ్రామాలలో మిర్చి సాగు చేసే రైతులలో 70 శాతం మంది సన్న, చిన్న కారు రైతులు, కౌలు రైతులు ఉన్నారు. దీనికి తోడు ఈనాం భూములు కావడంతో బ్యాంక్‌లలో పంట రుణాలు కూడా అంతంత మాత్రంగానే ఇస్తున్నారు. దీంతో అత్యధిక శాతం రైతులు పెట్టుబడులకు వ్యాపారుల మీద ఆధార పడాల్సిందే. ఈ నేపథ్యంలో వ్యాపారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. నాణ్యత లేని విత్తనాలు మొదలు, పురుగు మందులు విక్రయిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గత్యంతరం లేక రైతులు వాటినే అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. ఇక పంట చేతికి వచ్చిన తరువాత పచ్చి మిర్చిని వ్యాపారుల కనుసన్నలలోని దళారులకే అమ్మాల్సి రావటం రైతులకు మరింత నష్టం చేకూర్చుతుంది. బహిరంగ మార్కెట్ కంటే మరింత తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా ఉండే దళారులకే అమ్మాల్సి రావడం, బయట వ్యాపారులను స్థానికంగా కొనుగోలు చేసేందుకు రానివ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో స్థానికంగానే అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ఏటా రైతులు ఆందోళనలు


కొమ్మాలపాడు వద్ద లోడింగ్ చేస్తున్న పచ్చి మిర్చి బస్తాలు (ఫైల్)

చేయడం పరిపాటిగా మారింది. ఇది చాలదన్నట్లు స్థానికంగానే నకిలీ మిరప విత్తనాలను ప్రాసెసింగ్ చేయడం కూడా రైతులను మరింత ఆందోళన కలిగిస్తోంది. సమీప గ్రామాలలో పండే మిరప కాయల నుంచి విత్తనాలు తీసి ప్రాసెసింగ్ చేసి కంపెనీ లేబుల్స్ వేసి అమ్మకాలు చేస్తుండడం స్థానిక రైతులను కలవరపాటుకు గురిచేస్తుంది. పెద్ద కంపెనీల పేర్లతో స్థానింగా లభించే విత్తనాలను అమ్మకాలు చేస్తుండడం తెలుసుకున్న రైతులు విస్మయానికి గురవుతున్నారు. ఇలా విత్తనాల వద్ద నుంచి పురుగుమందులు, ఇతర పెట్టుబడుల వరకు స్థానిక వ్యాపారుల మీద ఆధారపడాల్సి రావడంతో ఆరుగాలం కష్టపడ్డా తీరా చేతికి వచ్చేది మాత్రం ఏమి ఉండడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు, మామిళ్లపల్లి, ఏల్చూరు, బల్లికురవ మండలం రామాంజనేయపురం, యస్‌యల్ గుడిపాడు తదితర గ్రామాల రైతులు ఎక్కువ విస్తీర్ణం లో మిరప సాగు చేస్తున్నారు. అదే సమయంలో కొమ్మాలపాడులోని వ్యాపారుల వద్ద పెట్టుబడులకు ఆశ్రయిస్తుంటారు. అధికారులు స్పందించి రైతులకు రుణాలు అందించే చర్యలు చేపట్టడంతో పాటు నకిలీ, కల్తీ విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.


మామిళ్లపల్లి పొలాల్లో అనుమతులు లేకుండా ప్యాకింగ్ చేస్తున్న మిరప విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)


బస్టాండ్‌లో 3వ నెంబర్ ప్లాట్‌ఫాం వద్ద ఊడిన స్లాబు పెచ్చులు

బస్టాండ్‌లో ఊడిపడ్డ స్లాబు పెచ్చులు

ఆందోళన చెందిన ప్రయాణికులు

అద్దంకి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని ఆర్టీసీ బస్టాండ్ లో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గురువారం సాయంత్రం 3వ నెంబర్ ప్లాట్‌ఫాం వద్దకు బస్సు వచ్చిన సమయంలో శ్లాబ్ పెచ్చులు ఊడి పడ్డాయి. అయితే ఆ సమయంలో పెచ్చులు ఊడిపడ్డ ప్రాంతంలో ప్రయాణికులు లేకపోవడం, బస్సులో నుంచి ప్రయాణికులు దిగక ముందు ఆ ఘటన జరగడంతో ప్రమాదం తప్పింది. బస్సు అద్దాల పై పెచ్చులు ఊడిపడడంతో కొద్దిమేర పగిలింది. ఈ విషయాన్ని ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు దృష్టికి తీసుకు పోగా పెచ్చులు ఊడి పడ్డాయని, అయితే ఆ సమయంలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

గురుకుల పాఠశాలకు గ్రైండర్ అందజేత

అద్దంకిటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శింగరకొండ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల ఉన్నత పాఠశాలకు గ్రైండర్‌ను గురువారం అందజేశారు. అద్దంకిలోని శ్రీ రంగనాయకులు బుక్స్ అండ్ ఫ్యాన్సీ స్టోర్ అధినేత బుల్లిబాబు, విశ్రాంత ఉపాధ్యాయుడు వారణాసి రఘురామశర్మల సౌజన్యంతో గురుకుల పాఠశాలకు రూ.18000వేలతో గ్రైండర్‌ను అందజేయడం జరిగిందని క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యులకు ప్రిన్సిపాల్ దుర్గ గాయత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురళిసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, దేవపాలన, చంద్రమౌళి, సందిరెడ్డి శ్రీనివాసరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం

అద్దంకిటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా వాటర్ బెల్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టినట్లు ఎంఈవో-2 బూదాటి సుధాకరావు అన్నారు. గురువారం స్థానిక నంబూరివారిపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో వాటర్ బెల్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈక్రమంలో ఐఈఈఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కిరణ్ విద్యార్థులకు వాటర్ బాటిళ్లను సమకూర్చగా, ఎంఈవో చేతుల మీదుగా వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మేదరమెట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఒకరు మృతి చెందిన ఘటన మేదరమెట్లలో గురువారం వేకువజామున జరిగింది. ఎస్సై మహమ్మద్ రఫి తెలిపిన వివరాల ప్రకారం మేదరమెట్ల బైపాస్‌లో రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మృతదేహం నుజ్జు నుజ్జు అయ్యి గుర్తుపట్టడానికి వీలులేకుండా పోయింది. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉండవచ్చని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

12న మార్టూరు యూనిట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక

మార్టూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు యూనిట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక వచ్చేనెల 12వ తేదీన మార్టూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహిస్తామని జిల్లా శాఖ అధ్యక్షుడు రావుల బాపయ్యచౌదరి తెలిపారు. అందుకు సంబంధించి గురువారం మార్టూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఎన్నికల షెడ్యూల్‌ను విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు యర్రగుంట కృష్ణమూర్తి విడుదల చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు షేక్ కమాలుద్దీన్, ఎం.పిచ్చయ్యశర్మ,చిట్టిబాబు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

అద్దంకి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శింగరకొండ రోడ్డులో కొత్త దామావారిపాలెం వద్ద ఉన్న ఊర్వశి వైన్స్‌లో చోరీ జరిగి సుమారు రూ.30వేలకు పైగా విలువైన నగదు, మద్యం బాటిళ్ల చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. శింగరకొండ రోడ్డులోని ఊర్వశి వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత పైకప్పు రేకుకు రంధ్రం వేసి దొంగ లోపలకు ప్రవేశించాడు. కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.20వేల నగదు, 9 మద్యం బాటిళ్లను దొంగలించుకుపోయాడు. అదే సమయంలో సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించే వీలు లేకుండా డీవీఆర్‌ను కూడా ఎత్తుకెళ్లాడు. కేబుల్స్ కట్ చేసి ఉంది. ఉదయం షాపు తెరిచేందుకు వెళ్లగా చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీ జరిగిన మద్యం షాపును గురువారం ఉదయం ఎక్సైజ్ సీఐ భవాని పరిశీలించారు. చోరీకి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ సుబ్బరాజు తెలిపారు.

ఉప్పు భూములను పునరుద్ధరణ చేయండి


జేసీ ప్రఖర్‌జైన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

చినగంజాం, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రైతులకు లీజుకు ఇచ్చిన భూములను పునరుద్ధరణ చేయాలని కోరుతూ చినగంజాం మండల పరిధిలోని ఏపీ స్టాల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అసోసియేషన్, సాల్ట్ వర్క్‌ర్స్ కో-ఆపరేటవ్ ప్రొడక్షన్ అండ్ సేల్స్ సొసైటీ సభ్యులు గురవారం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించేందకు పెదగంజాం వచ్చిన జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. 750 కుటుంబాల వారు ఉప్పు భూములపై ఆధారపడి జీవిస్తున్న వారు ఉపాధిని కోల్పోతున్నారని, ఉప్పు భూముల లీజు పునరుద్ధకణ చేయుట లేదా ప్రభుత్వ చట్ట ప్రకారం మా భూములను అభివృద్ధి కోసం ఎవరికైనా కేటాయిస్తే ప్రత్యామ్నాయంగా మాకు జీవనోపాధి కల్పించాలని, లేదా పట్టా, అసైన్డ్ భూములకు ఇచ్చే నష్ట పరిహారం మాకు కూడా ఇప్పించాలని కోరుతూ వినతిసత్రం అందజేశారు. కార్యక్రమంలో సాల్ట్ డిప్యూటీ ఇన్స్‌ప్పెక్టర్ జయమ్మ, మాజీ ఎంపీపీ బీవీ.రమణారెడ్డి, ఏ.పీ సాల్ట్ మ్యానుఫాక్చరింగ్ అసోసియేషన్, సాల్ట్ వర్కర్స్ కో ఆపరేటవ్ ప్రొడక్షన్ అండ్ సేల్స్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వసతి గదులకు రూ.1.20కోట్లు మంజూరు

బల్లికురవ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు అవసరమైన ఆరు వసతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1. 20 కోట్ల నిధులను మంజురు చేసింది. సమగ్ర శిక్ష ఏఈ రాజన్‌బాబు గురువారం కేజీబీవీ విద్యాలయం ఆవరణలో నూతన భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఆయనవెంట టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు, విద్యాలయ ప్రిన్సిపాల్ కె.సరళకుమారి, కాంట్రాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

తిమ్మరాజుపాలెం ఉపసర్పంచ్‌గా వాసంతి


వాసంతికి నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

తిమ్మరాజుపాలెం(పర్చూరు), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెం గ్రామ ఉపసర్పంచ్‌గా పాలపర్తి వాసంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో టీడీపీ ప్రజా కూటమి బలపరిచిన వాసంతిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన వాసంతికి ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు తెలిపారు. ఎన్నికల అధికారులుగా విద్యాశాఖాధికారి పి.వెంకటరామయ్య, ఈవోఆర్డీ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అచ్చెన్నకు ఏలూరి శుభాకాంక్షలు


మంత్రి అచ్చెన్నకు వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా గురువారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో అచ్చెన్నను ఎమ్మెల్యే కలిసి శు భాకాంక్షలు తెలి పారు. వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేసి అభిమానం చాటుకున్నారు.

నేటితో ముగియనున్న పురుషుల జట్టు ఖోఖో శిక్షణ

పంగులూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలోని పూరి పట్టణంలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టు ఖోఖో శిక్షణ నేటితో ముగియనుంది. ఈ నెల 16న పంగులూరులోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో రాష్ట్ర స్త్రీ, పురుష రాష్ట్ర జట్ల ఎంపిక జరిగింది. ఎంపిక అనంతరం పురుషుల జట్టుకు పంగులూరు ఎంఎస్ఆర్అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాలలో ఖోఖో అకాడమీలో శాప్ కోచ్ డీఎల్ రెడ్డి జట్టుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 17 నుంచి ప్రారంభమైన జట్టు శిక్షణ 28వ తేదీ శుక్రవారంతో ముగియనుంది.

చీరాలలో సెంట్రల్ టీం!

- ఓ వ్యాపారి ఇంట్లో అరుదైన వన్యప్రాణి ఎముక ఉన్నట్లు ఢిల్లీ అధికారులకు సమాచారం
- నిందితులను పట్టుకునేందుకు సోదాలు
- ఎట్టకేలకు గుర్తింపు.. మిగతా వారి కోసం ఆరా
- అనుమానంతో పరారైన కుటుంబం

చీరాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అరుదైన వన్యప్రాణికి సంబంధించిన ఎముక ఇంట్లో ఉన్నట్లు ఢిల్లీ వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్, వైల్డ్ కంట్రోల్ క్రైం బ్యూరో బృందానికి సమాచారం అందడంతో గత శుక్రవారం పట్టణంలో గుట్టుచప్పుడు కాకుండా విచారణ జరిపి ఓ కుటుంబాన్ని గుర్తించారు. నిందితులు పట్టణంలో వ్యాపారం నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు స్థానిక ఫారెస్ట్ అధికారుల సహకారంతో పట్టణంలోకి ప్రవేశించిన సెంట్రల్ టీం సభ్యులు నిందితుని దుకాణం వద్దకు గత శనివారం సాధారణ కొనుగోలుదారులు మాదిరిగా వెళ్లారు. అతనితో మాటలు కలిపి ఇంకా ఏమేమి అమ్ముతారంటూ లోతుగా ఆరా తీశారు. ఈక్రమంలోనే అతని ఇంట్లో ఉన్న వన్యప్రాణి ఎముకను గుర్తించి, ఇది దేనికి ఉపయోగిస్తారని అడగ్గా క్షుద్రపూజలకు అంటూ సమాధానం ఇచ్చారు. ఎముక తమకు కావాలని వారు అడగ్గా తనతోపాటు ఇంకా తెలిసిన వారు ఉన్నారు. రేపు ఇస్తానని వ్యాపారి సమాధానమిచ్చినట్లు సమాచారం. దీంతో మరుసటి రోజు వారిని పిలిస్తే మాట్లాడదామని సెంట్రల్ బృందం అక్కడి నుంచి వచ్చేసింది. మరుసటి రోజు అధికారులు వెళ్లిచూడగా ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో అధికారులు స్థానికంగా ఆరా తీయగా.. రాత్రికి రాత్రే చెప్పాపెట్టకుండా కుటుంబం పరారైనట్లు తెలుసుకున్నారు. దీంతో సెంట్రల్ టీం, ఫారెస్ట్ అధికారులు తిరిగి వెళ్లిపోయారు. అయితే వచ్చిన వారు పోలీసులని తెలుసుకుని ఆ కుటుంబసభ్యులు మకాం మార్చినట్లు తెలుస్తోంది. ఈ ఘటన పట్టణంలో కలకలం రేపుతోంది. దీనిపై మార్కాపురం ఫారెస్టు స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా సెంట్రల్ టీం విచారణ కోసం వచ్చిన మాట వాస్తవమని, కేసు పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

విద్యార్థులపై శ్రద్ధతో మెలగండి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు


ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. శంకరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యాలయాల్లో ఉన్న చిన్నారుల పట్ల శ్రద్ధతో మెలగాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. డీవీజీ శంకరరావు సూచించారు. గురువారం మండల పరిధిలోని వేటపాలెం బాలుర, బాలికల గురుకుల పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా చిన్నారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరినీ ఉత్సాహపరిచారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా రాణించాలని సూచించారు. అంతకుముందు చైర్మన్‌ను తహసీల్దార్ పార్వతి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

యానాది సమస్యలపై ప్రత్యేక చొరవ

నిరాధారంగా జీవిస్తున్న ఎస్టీలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. శంకరరావు అన్నారు. గురువారం తహసీల్దార్ పార్వతితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. స్థానికంగా నివసిస్తున్న ఎస్టీ (యానాదు)ల వివరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా తహసీల్దార్ పార్వతి ఇప్పటికే మండల పరిధిలో 2200 మంది ఎస్టీలను గుర్తించినట్లు వివరించారు. అలాగే వారిలో ఆధార్ సమస్యలున్న 694 మందికి పరిష్కరించినట్లు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. వారి జీవన మనుడగపై ప్రత్యేక దృష్టి సారించి పథకాలందేలా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో డీటీ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు చెల్లింపు

కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల కృతజ్ఞతలు

అద్దంకిటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గత సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న సీపీఎస్ ఉద్యోగులకు ప్రాన్ అకౌంట్స్‌లోని బకాయిలను ప్రభుత్వం చెల్లించడం పట్ల ప్రభుత్వానికి ఏపీసీపీఎస్‌ఈఏ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని రాష్ట్ర కౌన్సిలర్ దామా నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నూతలపాటి మార్క్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలోనే సీపీఎస్ ఉద్యోగుల ఇన్‌కం ట్యాక్స్ చెల్లించి పెండింగ్‌లో ఉన్న 2018 జూలై డీఏ, 2019 జనవరి డీఏ బకాయిలు, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న సరండర్ లీవ్ బకాయిలు కూడా విడతలో చెల్లించాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నామన్నారు. సీపీఎస్ ఉద్యోగులు స్వామి, వెంకయ్య, హనుమంతరావు, భక్తరాజు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం, గరటయ్యకాలనీలో శుక్రవారం పాత విద్యుత్ స్తంభాలను మార్చి కొత్త విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని టౌన్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆయా ప్రాంతాలలో ఉదయం 6 గంటల నుంచి సాయం త్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

సబ్ ట్రెజరీలో వార్షిక తనిఖీలు

చీరాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఉప ఖజానా కార్యాలయంలో గురువారం జిల్లా ట్రెజరీ, అకౌంట్ అధికారి ఆర్ శివకామేశ్వరి వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సుదీర్ఘంగా పలు రికార్డులు, అటెండెన్స్ వివరాలు, పరిశీలించారు. అలాగే ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపద్యంలో లైఫ్ సర్టిఫికేట్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం పరిధిలో 3360 పెన్షన్‌లు ఉండగా వారిలో 200 లైఫ్ సర్టిఫికేట్స్ అందించడంలో జాప్యం ఉన్నట్లు తెలుసుకున్నారు. సకాలంలో వారి సర్టిఫికేట్స్ సేకరించి అప్‌లోడ్ చేయాలని ఇంచార్జి ఎస్టీవో ఎంవి సుబ్బారావుకు సూచించారు. ఆమె వెంట ఎస్టీవో మీరావలి, సిబ్బంది ఉన్నారు.

అద్దంకి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా పద్మావతి?

ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ

మేదరమెట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పి.గుడిపాడుకి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మందా నాగేశ్వరరావు కుమార్తె వరగాని పద్మావతి పేరు దాదాపు ఖరారైనట్లు తెలుస్తుంది. గురువారం పలువురు తెలుగుదేశం నాయకులకు ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా వరగాని పద్మావతి ఏఎంసీ చైర్మన్‌గా మీకు అంగీకారమేనా, మీకు అంగీకారం లేకపోతే 1 నొక్కండి, అంగీకారమైతే 2 నొక్కండి మీరు ఈ విషయాన్ని మరలా వినదలచుకుంటే సున్నా నొక్కండంటూ ఫోన్లు వస్తున్నాయి. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దాదాపుగా పద్మావతి పేరును ఖరారు చేసినట్లు సమాచారం. మండలంలో సీనియర్ టీడీపీ నాయకులు మందా నాగేశ్వరరావు తొలి నుంచి మండలంలో పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు.


ఇంటర్ విద్యార్థిని ప్రవళిక ఆత్మహత్య


ప్రవళిక మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పంగులూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదవాడ గ్రామంలో ఇంటర్ విద్యార్థిని వలేరు ప్రవళిక (16) ఆత్మహత్య చేసుకుంది. రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు సమాచారం మేరకు బూదవాడ గ్రామానికి చెందిన వలేరు ప్రవళిక స్థానిక పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. పరీక్షలు రాసిన అనంతరం గ్రామంలో మిరప కోతలు కోసే పనులకు వెళ్తోంది. ప్రవళిక తండ్రి అంజయ్య భార్యతో కలసి పొగాకు పనులకు వలస వెళ్లగా, ప్రవళిక పెద్దమ్మ రమాదేవి దగ్గర ఉంటూ బుధవారం ఉదయం మిరప కాయలు కోసే పనికి వెళ్లింది. ప్రవళిక మధ్యాహ్నం ఇంటికి వచ్చి కొంత సమయం తర్వాత బయటకు వెళ్లింది. మిరప కోతకు వెళ్లి ఉంటుందని భావించిన పెద్దమ్మ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులతో కలసి వెతికింది. ఎంతకూ కనిపించక పోవడంతో తల్లిదండ్రులకు సమాచారం తెలిపింది. గురువారం ఉదయం గ్రామానికి చేరుకున్న అంజయ్య దంపతులు రేణంగివరం పోలీస్ స్టేషన్లో ప్రవళిక కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసిన ఎస్ఐ వినోద్‌బాబు తన సిబ్బందిని బృందాలుగా పంపి వెతికే ప్రయత్నం చేయగా గ్రామానికి చెందిన ఓ రైతు గ్రామానికి తూర్పు వైపున పంట పొలాల్లో బాలిక మృతదేహం ఉందని సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా ప్రవళిక నేల బావిలో శవమై కనిపించింది. బావి నుంచి బాలిక మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు పంచనామా పూర్తి చేసిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌బా బు తెలిపారు. బాలిక తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించడం తో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు.

ఘనంగా సినీనటుడు రాంచరణ్ జన్మదిన వేడుకలు

చీరాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలో ఘనంగా సినీ నటుడు రాంచరణ్ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ, టీడీపీ కూటమి నాయకులు, అభిమాన సంఘాల ఆధ్వర్యంలో జరిగాయి. ఈసందర్భంగా ముందుగా దేశాయిపేట వృద్ధాశ్రమంలో కేక్ కటింగ్ నిర్వహించి అన్నదానం చేశారు. అనంతరం ఏరియా వైద్యశాలలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో శివరామప్రసాద్, గజవల్లి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, రాధారంగ మిత్ర మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇక మిగిలింది నాలుగురోజులే.... రేషన్‌కార్డుదారులు తమ కార్డులను ఈకేవైసీ చేయించుకోవడం పెద్ద సమస్యగా మారింది. కార్డుల్లోని కుటుంబ సభ్యులంతా ఈ ప్రక్రియను చేయించుకోవాలని కేంద్రం నిబంధన విధించింది. ఇది పూర్తయితే కార్డులోని సభ్యులంతా ఉన్నారా.. లేదా..? అని తెలిసిపోతుంది. చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు పలువురు కార్డులో సభ్యులుగా చేరిఉంటారు. అలాంటి వారంతా ఇప్పుడు ఈకేవైసీ చేయించడం వల్ల వారి వివరాలు అప్‌డేట్ అవుతాయి. ఈనేథ్యంలో కార్డుదారులంతా ఈకేవైసీ చేయించుకోవాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

మిగిలింది నాలుగు రోజులే !

- గుబులు రేపుతున్న ఈకేవైసీ
- రేషన్‌కార్డుదారుల్లో ఆందోళన
- జిల్లాలో 2,01,951 మందికి పెండింగ్
- చేయించుకోకుంటే సరుకులు బంద్

జిల్లాలో 7.21లక్షల రేషన్ కార్డులున్నాయి. వీటిలో 20,04,581మంది సభ్యులున్నారు. వీరికి 1,513 చౌకదుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం 20.4లక్షల మంది ఈకేవైసీ చేయించుకోవాలి. ఇప్పటివరకు 18,02,630మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 2,01,951మంది చేయించుకోలేదని జిల్లా పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. ఈనెలాఖరులోగా చేయించుకోకపోతే ఏప్రిల్‌లో రేషన్‌సరుకులు ఇవ్వబోమని డీఎస్‌వో డీ. అంకయ్య చెబుతున్నారు.

కార్డుదారుల ఆందోళన

అధికారుల తీరుతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. కార్డుల్లో ఉన్న విద్యార్థులు చాలామంది ఇతర ప్రాంతాల్లో చదువుల కోసం వెళ్లి ఉన్నారు. అంతేకాక ప్రస్తుతం పరీక్షల సీజన్ కొనసాగుతోంది. ఆ విద్యార్థులంతా చదువులపైనే దృష్టి పెట్టారు. తల్లిదండ్రులు సైతం పరీక్షల సమయంలో పిల్లలను ఇబ్బందులు పెట్టకూడదని జాగ్రత్త పడుతున్నారు. కొంతమంది విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటున్నారు. ఈ క్రమంలో నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని లేకపోతే, వచ్చే నెలలో సరుకులు ఇవ్వమని చెప్పడంపై కార్డుదారులు మండిపడుతున్నారు.

అధికారుల వితండ వాదన

నిబంధనలతో కార్డుదారులు ఆందోళన చెందుతుంటే, అధికారులు మాత్రం వితండ వాదన చేస్తున్నారు. ఎక్కడున్నా చౌకదుకాణం డీలర్లు, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ, వార్డు సచివాలయం, ఈపోస్ మిషన్ల ద్వారా ఈకేవైసీ చేయించుకోవచ్చునని చెబుతున్నారు. బయట వెళ్లిన విద్యార్థులకు ఆయా ప్రాంతాల్లో సచివాలయాలు, గ్రామ రెవెన్యూ అధికారి, రేషన్‌డీలర్లు ఎక్కడుంటారో తెలియదు. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యార్థులను బయటకు రాని వ్వరు. ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారికి అక్కడ సచివాలయాలు ఉంటాయో, లేదో తెలియదు. అయితే ఇక్కడ అధికారులు మాత్రం ఎక్కడోచోట ఈకేవైసీ చేయించుకోవాలని, లేక పోతే సరుకులు కట్ అవుతాయని చెబుతు న్నారు. ఈ వ్యవహారం కార్డుదారులకు మరింత ఇబ్బందిగా మారింది.



రేషన్ డీలర్ వద్ద ఈకేవైసీ చేయించుకుంటున్న కార్డుదారులు

ఈకేవైసీ చేయించుకుంటేనే సరుకులు

రేషన్‌కార్డుల్లో ఉన్న సభ్యులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. ఈ విషయాన్ని కొద్ది రోజులుగా చెబుతూ వస్తున్నాం. జిల్లాలో ఇంకా రెండు లక్షల మందికిపైగా ఈకేవైసీ చేయించుకోవాలి. నెలాఖరువరకు అవకాశం ఉంది. అప్పటికి ఎంతమంది చేయించుకున్నారో వారికి మాత్రమే ఏప్రిల్ నెల సరుకులు అందుతాయి.

- డీ అంకయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి

డీఆర్‌డీఏలో అక్రమాలపై చర్యలు

- రూ.1.41 కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు వెల్లడి
- ఏడుగురు ఉద్యోగులపై వేటుకు రంగం సిద్ధం ?

నెల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పేదల సొమ్మును దిగమింగిన అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. యానాదులకు దక్కాల్సిన నిధులను తినేసిన వ్యక్తుల నుంచి రికవరీ చేసేందుకు చర్యలు మొదలయ్యాయి. కలెక్టర్ ఆదేశాలతో డీఆర్‌డీఏలో ఇంటి దొంగల పనిపట్టేందుకు రంగం సిద్ధమైంది. రాపూరు మండలంలో జరిగిన అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 24న 'డీఆర్‌డీఏలో ఇంటిదొంగలు' అనే శీర్షికన కథనం, అలానే 27న 'అమాయకుల నోళ్లు కొట్టారు!' అనే శీర్షికన కథనం ప్రచురితమయ్యాయి. స్పందించిన డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి విచారణను వేగవంతం చేశారు. తొమ్మిది మందితో కూడిన కమిటీ ఇచ్చిన నివేదికను కలెక్టర్ ముందు పెట్టారు. కలెక్టర్ ఆదేశాలతో నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన ఉద్యోగులను గుర్తించి చర్యలకు ఉపక్రమించారు. రాపూరు మండలంలో పొదుపు సంఘాలకు సంబంధించిన రూ.1.41 కోట్లు నిధులు దుర్వినియోగమైనట్లు పీడీ నాగరాజకుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో ఇప్పటికే రూ.57 లక్షలు రికవరీ చేశామని, మరో రూ.84 లక్షలు రికవరీ చేయాల్సి ఉందని ఆమె వివరించారు. ఈ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన ఏడుగురు ఉద్యోగులపై చార్జస్ ఫ్రేమ్ చేసినట్లు వెల్లడించారు. వీరందరికీ నోటీసులు జారీ చేశామని, వారి వివరణ తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని పీడీ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాకాణి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై
విచారణ ఒకటికి వాయిదా

- వివరాలు సమర్పించాలని పోలీసులకు ఆదేశం



అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్ ఆరోపణలతో పొదలకూరు పోలీసులు ఈ ఏడాది ఫిబ్రవరి 16న తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ కేసుకి సంబంధించి పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లిఖార్జునరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పొదల కూరు మండలం, వరదాపురం గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అక్రమంగా క్వార్జ్ ఖనిజాన్ని తవ్వి తరలించారని జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న పొదల కూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీనేత కాకాణి గోవర్ధన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచార ణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి స్పందిస్తూ... మధ్యంతర ముందస్తు బెయి ల్ కోరుతూ అనుబంధ పిటిషన్ దాఖలు చేశామన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ... పోలీసులు వివరాలు సమర్పించిన అనం తరం అను బంధ పిటిషన్ పై విచారణ జరుపుతామని స్పష్టం చేశారు.మరోవైపు ఇదే కేసును కొట్టివేయాలని కోరుతూ కాకాణి వేసిన మరో పిటిషన్‌ని కూడా న్యాయమూర్తి ఏప్రిల్ 1కి వాయిదా వేశారు.



విడవలూరు ఎంపీపీగా ప్రమాణం చేస్తున్న ఏకుల శేషమ్మ



పొదలకూరు : ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న తాటిపర్తి ఉప సర్పంచి పెంచల లక్ష్మమ్మ

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.26 (శుక్రవారం సాయంత్రం)
సహరి : 4.51 (శనివారం ఉదయం)

'స్థానిక'ంలో
టీడీపీ మద్దతుదారుల విజయం

- విడవలూరు ఎంపీపీగా ఏకుల శేషమ్మ
- తాటిపర్తి ఉప సర్పంచిగా పెంచల లక్ష్మమ్మ
- ఇనమడుగు ఉప సర్పంచుగా చేజర్ల మోహన్
- దగదర్తి మండల వైస్ ఎన్నిక నేటికి వాయిదా

జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీ అయిన విడవలూరు ఎంపీపీ, పొదలకూరు మండలం తాటిపర్తి, కోవూరు మండలం ఇనమడుగు ఉపసర్పంచు పదవులకు గురువారం ఎన్నికలు నిర్వహించగా, టీడీపీ మద్దతుదారులు విజయం సాధించారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కాగా దగదర్తి వైస్ ఎంపీపీ ఎన్నిక కూడా జరగాల్సి ఉండగా,ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఎంపీపీ, ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాకపోవడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేసినట్లు రిటర్నింగ్ అధికారి సుబ్బరాజు ప్రకటించారు. ఆ వివరాలు...

విడవలూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ స్థానాన్ని టీడీపీ మద్దతుదారు కైవసం చేసుకున్నారు. మండలంలోని ఊటుకూరుకి చెందిన ఎంపీటీసీ ఏకుల శేషమ్మ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీగా ఉన్న భవానమ్మ గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ముదివర్తికి చెందిన ఎంపీటీసీ కాయల సౌందర్య తాత్కాలిక ఎంపీపీగా కొనసాగుతూ వస్తున్నారు. ప్రభుత్వం ఎంపీపీ ఉప ఎన్నికకు ఈనెల 18న నోటిఫికేష విడుదల చేసింది. దీంతో స్థానిక ఎంపీపీ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఎన్నికను నిర్వహించారు. మండలంలో 13 మందికిగాను 9 మంది ఎంపీటీసీలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. మండల వైస్ ఆవుల శ్రీనివాసులు ఏకుల శేషమ్మని ప్రతిపాదించగా, వావిళ్ల ఎంపీటీసీ తాతా రమ బలపరిచారు. మిగిలిన ఏడుగురు ఎంపీటీసీలు చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో శేషమ్మ ఎంపీపీగా ఎంపికయినట్లు ఎన్నికల అధికారి మోహన్‌రావు ప్రకటించారు. దీంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఎంపీపీని పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్‌కుమారి, తహసీల్దారు చంద్రశేఖర్, టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి కోడూరు కమలాకర్‌రెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, రామిరెడ్డి విజయబానురెడ్డి, పొన్నలూరు పురందర్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, చెముకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : ఇనమడుగు ఉప సర్పంచిగా నియామకపత్రాన్ని అందుకుంటున్న చేజర్ల మోహన్

ఏకగ్రీవంగా ఉపసర్పంచి ఎన్నిక

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిపర్తి ఉపసర్పంచిగా కర్పూరం పెంచలలక్ష్మమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉపసర్పంచిగా ఉన్న వ్యక్తి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. గురువారం జరిగిన ఎన్నికల్లో మూడో వార్డు మెంబరు పెంచలలక్ష్మమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వీరయ్య ప్రకటించారు. అనంతరం ఆమెకు ధ్రువీకరణ పత్రం అందచేసి, పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు. తాటిపర్తి సమస్యాత్మక గ్రామం కావడంతో నెల్లూరు డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు నేతృత్వంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ ఎన్నిక పట్ల టీడీపీ నేతలు హర్షం ప్రకటించారు.

ఇనమడుగు ఉపసర్పంచుగా చేజర్ల మోహన్

కోవూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇనమడుగు ఉపసర్పంచుగా టీడీపీ బలపరచిన చేజర్ల మోహన్ గురువారం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసులు ప్రకటించారు. తొమ్మిది వార్డు సభ్యుడు చేజర్ల మోహన్ వైసీపీకి చెందిన వార్డు సభ్యుడు నన్నం శ్రీనివాసులుపై పోటీ చేసి గెలుపొందారు. వైసీపీకి చెందిన ఎస్. మణికంఠ రాజీనామాతో ఉపసర్పచు పదవికి ఖాళీ ఏర్పడింది. టీడీపీ, వైసీపీలు బలపరచిన అభ్యర్థుల మధ్య పోటీ ఉద్రిక్తతల నడుమ జరిగింది. ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉపసర్పంచుగా గెలు పొందిన మోహన్‌ను టీడీపీ నాయకు లు జెట్టి రాజగోపాలరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, సునీల్‌రెడ్డి అభినందించారు.



బిట్రగుంట : ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల కోసం ఎదురుచూస్తున్న రిటర్నింగ్ అధికారి సుబ్బరాజు తదితరులు

నేడు దగదర్తి వైస్ ఎంపీపీ ఎన్నిక

దగదర్తి, (బిట్రగుంట) మార్చి 27(ఆంధ్రజ్యోతి): దగదర్తి ఎంపీ డీవో కార్యాలయ సమావేశ భవనంలో గురువారం వైస్ ఎంపీపీ ఉపఎన్నికకు ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. రిటర్నింగ్ అధికారి సుబ్బరాజు, తహసీల్దారు కృష్ణ ఎన్నిక నిర్వహించేందుకు ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎంపీపీ, ఎంపీటీసీలు ఎవరూ రాకపోవడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

రైతుల మొర ఆలకించరా !?

- భూసేకరణ నోటిఫికేషన్ రద్దుకు డిమాండ్
- ఏపీ మారిటైమ్ బోర్డు అధికారులను కలిసిన చేవూరు రైతులు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల కోసం చేవూరులో చేస్తున్న భూసేకరణ తీరుపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమవుతోంది. గ్రామస్థుల ఉపాధి, ప్రత్యామ్నాయ జీవనాధారం గురించి పట్టించుకోకుండా భూమిని తీసుకునే దిశగా అధికారులు మొండిగా భూసేకరణ నోటిఫికేషన్లు విడుదల చేస్తుండటంపై రైతుల్లో అభ్యంతరం వ్యక్తం అవుతోంది. ఈ నెల 22న గ్రామంలో కందుకూరు సబ్‌కలెక్టరు తిరుమణి శ్రీపూజ, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, భూసేకరణ అధికారులు ప్రజాభి ప్రాయ సేకరణ కోసం నిర్వహించిన సమావేశంలో పలు అభ్యంతరా లను వ్యక్తం చేసిన గ్రామస్థులు అదే విషయాన్ని ఏపీ మారిటైమ్ బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ప్రధానంగా గ్రామం చుట్టూ భూమిని మొత్తం తీసేసుకుంటున్నందున తమ జీవనోపాధి ఎలా అన్నది అధికారులు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో రెండో వంతు జనాభా వ్యవసాయ కూలీలే ఉన్నందున వారికి ప్రత్యామ్నాయ ఉపాధిపై స్పష్టత ఇవ్వాలని, ఫిబ్రవరి 28న జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే కొన్ని దశాబ్దాలుగా నిరుపేదలు సాగు చేసుకుంటున్న కొన్ని భూములు రెవెన్యూ రికార్డులలో కుంటపోరంబోకుగా ఉన్నందున క్షేత్ర పరిశీలన ద్వారా ఆ భూముల క్లాసిఫికేషన్ మార్పు చేసి సాగుదారులకు పరి హారం అందేలా చూడాలన్నది మరో డిమాండ్. ఈ డిమాండ్లలో పేదలు సాగు చేసుకుంటున్న కుంటపోరంబోకు భూములకు 50 శాతం పరిహా రం అందేలా చర్యలు తీసుకుంటామని, గత నెల 28న జారీ చేసిన నోటి ఫికేషన్ రద్దయ్యేలా చూస్తామని సబ్ కలెక్టరు, భూసేకరణ అధికారులు హామీ ఇచ్చినా మిగిలిన డిమాండ్లపై వారు స్పష్టమైన హామీ ఇవ్వలేక పోయారు.

మారిటైమ్ బోర్డు చైర్మన్, ఉన్నతాధికారులతో భేటీ

చేవూరు రైతులు గ్రామానికి చెందిన నూతలపాటి వెంకటేశ్వర్లు నేతృత్వంలో గత మంగళవారం పోర్టు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు రాజశేఖర్‌తోపాటు వెళ్లి ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, భూసేకరణ అధికారులతో భేటీ అయ్యారు. గ్రామం చుట్టూ కొంత భూమి వదిలాలని, ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని, చేవూరును పోర్టు సిటీగా అభివృద్ధి చేయాలని, గ్రామ పరిధిలో జాతీయ రహదారి వెంట అటవీ శాఖ 50 ఎకరాల్లో చిల్డ్రన్స్ పార్కు, హోటల్ అభివృద్ధి చేస్తున్నందున దానిచెంతనే ఉన్న చెరువుతో కలుపుకుని బోటు షికారు, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.కలెక్టరుతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

నగరంలో మినీ బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులను ఎలాగైనా దక్కించుకోవాలని కుట్ర పన్నిన ఓ కాంట్రాక్టర్, రాజకీయ నాయకుడైన అతడి తండ్రి ప్రయత్నాలు బెడిసికొట్టాయి. టెండర్లు వేయకుండా ఇతర కాంట్రాక్టర్లను అడ్డుకోగా, ఓ ప్రజాప్రతినిధి ద్వారా ఇంకొంతమంది ఒత్తిడి తెచ్చారు. అయితే మినీ బైపాస్ వర్కుకు గురువారం టెండర్లు ఓపెన్ చేయగా సదరు కాంట్రాక్టర్ డిస్‌క్వాలిఫై అవ్వడం గమనార్హం. ఈ కాంట్రాక్టర్‌కు ఎక్స్‌పీరియన్స్ లేకపోవడంతో నేషనల్ హైవే (ఎన్‌హెచ్) అధికారులు అతడి టెండర్‌ను డిస్‌క్వాలిఫై చేశారు. అంటే అర్హత లేకపోయినా అడ్డదారిలోనైనా వర్కు దక్కించుకోవాలన్న ప్రయత్నాలు జరిగినట్లు దీనిని బట్టి స్పష్టమవుతోంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

డామిట్..
కథ అడ్డం తిరిగింది!

- మినీ బైపాస్ రోడ్డు వర్కు కోసం ఓ కాంట్రాక్టర్ ప్రయత్నాలు
- మిగిలినవారు పోటీ రాకుండా బెదిరింపులు
- కొంతమందిని అడ్డుకోవడంలో సఫలం
- అయితే చివరకు ఆ కాంట్రాక్టర్‌కే ఎదురుదెబ్బ
- ఎక్స్‌పీరియన్స్ లేకపోవడంతో డిస్‌క్వాలిఫై చేసిన ఎన్‌హెచ్

నెల్లూరులో దెబ్బతిన్న మినీ బైపాస్ రోడ్డును బాగు చేయాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులు రూ.13.74 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. ఇది ఎన్‌హెచ్ వర్కు కావడం తో త్వరగా బిల్లులు వస్తాయన్న ఉద్దేశంతో చాలా మంది కాం ట్రాక్టర్లు టెండర్లు వేసేందుకు ఆసక్తి చూపారు. అయితే నెల్లూరుకు చెందిన ఓ రాజకీయ నేత ఎలాగైనా ఈ వర్కును దక్కిం చుకోవాలని ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వెళ్లిపోయే సదరు నేత.. తన కుమారుడికి ఆ వర్కును ఇప్పించేందుకు పావులు కదిపారు. కాంట్రాక్టర్లు టెండర్లు వేయకుండా తనకున్న పలుకుబడితో పరోక్ష బెదిరింపులు చేయిం చినట్లు కాంట్రాక్టర్ల వర్గాలు చెబుతున్నాయి. అయితే ఐదుగురు బడా కాంట్రాక్టర్లు మాత్రం టెండర్లు వేశారు. పాపం.. సదరు రాజకీయ నేత వర్కు కోసం దొడ్డిదారిలో ఇంత కష్టపడగా, చివరకు అతడి కుమారుడు ఆ వర్కుకు క్వాలిఫైనే కాకపోవడం గమనార్హం. ఈ వర్కుకు నేషనల్ హైవే అధికారులు పెట్టిన ఎక్స్‌పీరియన్స్ నిబంధనను ఈ కాంట్రాక్టర్ అందుకోలేక పోవడంతో డిస్‌క్వాలిఫై చేసినట్లు సమాచారం.

నాడు ఆర్‌అండ్‌బీలోనూ ఇంతే

ఈ రాజకీయ నేతకు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అక్కడి పెద్దలతో సంబంధాలు పెంచుకుంటుంటారు. ఆ పరిచయాలతో దొడ్డిదారిలో టెండర్లు దక్కించుకోవడం ఆయన ప్రత్యేకతగా ఇంజనీరింగ్ వర్గాలు చెబుతుంటాయి. వైసీపీ ప్రభుత్వంలో కూడా ఈ నేత కుమా రుడికి ఓ వర్కును కట్టబెట్టేందుకు అనేక కుట్రలు జరిగాయి. నెల్లూరు-కృష్ణపట్నం పోర్టు నిర్వహణకు 2022లో టెండర్లు జరగ్గా అప్పుడు కూడా ఈ కాంట్రాక్టర్‌కు ఎక్స్‌పీరియన్స్ లేదు. అయినా ఫేక్ సర్టిఫికెట్లతో టెండర్ దాఖలు చేశారు. ఈ విషయం బయటకు రాకపోయి ఉంటే ఆ వర్కు సదరు కాంట్రాక్టర్‌కే దక్కేది. అయితే వ్యవహారం బయటపడటంతో అప్పుడు కూడా డిస్ క్వాలిఫై చేశారు. ఫేక్ ఎక్స్‌పీ రియన్స్ పెడితే సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలి. అయినా తనకున్న పలుకుబడితో ఆ రాజకీయ నేత.. తన కుమా రుడిని బ్లాక్ లిస్టులో పెట్టకుండా తెరవెనుక చక్రం తిప్పా రు. అప్పుడు ఆర్‌అండ్‌బీలో చేసిన జిమ్మిక్కు మాదిరిగానే ఇప్పుడు ఎన్‌హెచ్‌లో కూడా ఎక్స్‌పీరియన్స్ లేకపోయినా వర్కు దక్కించుకునేందుకు ప్రయ త్నాలు చేయడం తీవ్ర చర్చనీయాం శంగా మారింది. కాగా మినీబైపాస్ రోడ్డుకు ప్రైస్ బిడ్‌ను ఓపెన్ చేయగా ఓ కాంట్రాక్టర్ 23.15 శాతం లెస్‌కు టెండర్ దక్కించుకోవడం గమనార్హం. అంటే రూ.13.74 కోట్ల వర్కును రూ.10.56 కోట్లకు చేస్తానని సదరు కాంట్రాక్టర్ ముందుకొచ్చారు. ఇంత ఎక్కువ లెస్‌కు దక్కించుకోవడం కూడా చర్చనీయాంశమైంది. మిగిలిన కాంట్రాక్టర్లు 3.49 శాతం, 1.86 శాతం, 0.01 శాతం లెస్‌కు కోట్ చేయగా మరో కాంట్రాక్టర్ 0.03 శాతం ఎక్సెస్‌కు కోట్ చేయడం గమనార్హం.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230

కోడిగుడ్ల ధర (100): 470

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8488
వెండి కిలో ధర	రూ. 102,000
వెండి ఒక గ్రాము	రూ.105.50

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): కరేడు గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రవేశం కోసం ఈనెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే సింధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 మంది విద్యార్థుల చొప్పున ప్రవేశానికి అవకాశం ఉందన్నారు. అదేవిధంగా 7,8 తరగతులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఉన్న ఖాళీలను భర్తీచేయుటకు అనుమతులు లభించినందున ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9603709478 ఫోన్ నెంబరుకు కాల్ చేసి వివరాలు పొందవచ్చని తెలిపారు.

మద్యం సిండికేట్..!

- షాపుల్లో మద్యం బార్లలో అధిక ధరకు విక్రయం
- ఆదాయం సగం.. సగం
- తెల్లవారుజామునే తెరుచుకుంటున్న బార్లు
- కందుకూరులో వ్యాపారుల తీరు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

కందుకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కందుకూరులో మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యారు. పైకి చూసేందుకు మద్యం షాపులు తూ.చ తప్పకుండా నిబంధనలు పాటిస్తున్నట్లు కనిపించేలా వ్యవహరిస్తూ అక్కడి మద్యం బార్ అండ్ రెస్టారెంట్లలో అధిక దరకు విక్రయిస్తూ మందుబాబులను దోచు కొంటున్నారు. వచ్చే ఆదాయం సగం పగం పంచుకున్నటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పక్కా ప్రణాళికతో రూపకల్పన చేసి ఈ సిండికేట్ వ్యవహారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఇదంతా తెలిసినా ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తూ వ్యాపారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కందుకూరులో ప్రస్తుతం జరుగుతున్న మద్యం లాలూచీ వ్యాపారం గత వైసీపీ



కందుకూరు పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్

ప్రభుత్వంలోనూ ఇలాగే కొనసాగింది. అప్పటి ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాలలో ప్రజలు కోరుకునే ఏ బ్రాండ్లు దొరకకుండా చేసి వాటిని బార్ అండ్ రెస్టారెంట్లకు తరలించి భారీగా అదనపు వసూళ్లతో విక్ర యాలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అదే తరహా లో బార్ అండ్ రెస్టారెంట్‌లలో క్వార్టర్ సీసాపై రూ.60 అదనంగా వసూలు చేస్తూ ఆ మొ త్తాన్ని దుకాణదారులు, రెస్టారెంట్ల నిర్వాహకులు పంచు కుంటున్నారన్న ఆరోప ణలు ఉన్నాయి. దీంతో తక్కువ దరకే నాణ్యమైన మద్యం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. దోపిడీకి గురవుతున్న మద్యం ప్రియులు మాత్రం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఈ వ్యవహారం నడుస్తుండగా గతంలో పోలిస్తే రోజుకు లక్ష రూపాయల వరకు అదనపు రాబడి వస్తుండటంతో ఎక్సైజ్ అధికారుల సహాయ సహకారాలతో సిండికేట్‌ను నడిపిస్తున్నారన్న విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి.

బార్ అండ్ రెస్టారెంట్లూ నిబంధనలు పాటించేలా చూస్తాం

కందుకూరు పట్టణంలో మద్యం దుకాణదారులు సమయపాలన, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకున్నాం. ఇకముందు బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు కూడా నిబంధనలు పాటించేలా చూస్తాం. మద్యం షాపులకు సంబంధించిన మద్యం బయట పట్టుబడితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవు.

- ఎక్సైజ్ సీఐ వెంకటరావు

● తెల్లవారకముందే తెరుచుకుంటున్న బార్లు

నూతన మద్యం పాలసీ అమల్లోకి తెచ్చాక కందుకూరు పట్టణంలో 7 మద్యం దుకాణాలు ఏర్పాటు కాగా ఎప్పటి నుంచో 3 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇటీవలి కాలం వరకు మద్యం దుకాణాలు సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయించాలని చేసిన ప్రయ త్నాలు ఫలించక పోవడంతో పక్కా ప్రణాళి కతో బార్ల యజమానులతో కలసి సిండికేట్ ఏర్పాటు చేశారు. నిన్న మొన్నటి వరకు వేళలు పాటించకుండా, షాపుల వద్ద సిట్టింగ్ ఏర్పాటు చేస్తూ లూజు విక్రయాలు చేసిన మద్యం వ్యాపారులు ప్రస్తుతం వాటన్నింటికీ ఫుల్‌స్టాప్ పెట్టేశారు. వేళకు దుకాణాలు తెరిచి వేళకు మూసి వేయటమే గాక మిగిలిన నిబంధ నలన్నీ తూ.చ తప్పకుండా పాటిస్తూ అధిక ఆదాయం వచ్చే బ్రాండ్లను ఉదయం, రాత్రి వేళల్లో అధికంగా అమ్ముడు పోయే పేద వారి బ్రాండ్ చీప్ లిక్కర్‌ను బార్ అండ్ రెస్టారెంట్లలో అందుబాటులోకి తెచ్చేశారు. గతంలో ఉదయాన్నే తీసే మద్యం దుకా ణాలు వేళఅయ్యే వరకు తెరకవపోతుండగా బార్ అండ్ రెస్టారెంట్లు మాత్రం వేకువ జామునే బార్లా తెరుచుకుంటున్నాయి. టీ దుకాణాల కన్నా ముందే బార్లు తీస్తుండ టమే గాక అర్ధరాత్రి వరకు విక్రయాలు సాగి స్తుండటంతో మందుబాబులు ఆ సమయాల్లో విధిలేక బార్‌కు వెళ్లి అదనపు దరకు కొనుగోలు చేస్తున్నారు. సిండికేట్‌గా మారటంతో ఇక తమను అడిగేవారు ఉండరన్న ధీమాతో అన్నిరకాల బ్రాండ్లపై క్వార్టర్‌కు రూ. 60 నుంచి 80 వరకు వసూలు చేస్తుండటమే గాక బీర్ బాటిల్‌పై రూ.100 వరకు అదనంగా బాదుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారానికి ఎక్సైజ్ అధికారులు కూడా సంపూర్ణ సహకారం అందిస్తుం డటంతో సిండికేట్ వ్యవహారం మూడు క్వార్టర్లు ఆరు బీర్లు అన్న చందంగా మారింది.

పగడాల ప్రవీణ్ హత్య దారుణం

అల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో దైవ ప్రచారకుడు పగడాల ప్రవీణ్ కుమార్‌ను హత్యచేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నా.. ప్రమాదంగా భావించడం దారుణమని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆయన పేర్కొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన

దగదర్తి, (బిట్రగుంట) మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిపోడు సెంటర్ వద్ద టీడీపీ నేతలు మాలేపాటి సోదరుల ఆధ్వ ర్యంలో నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, స్వర్గీయ ఎన్టీరామారావు విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. గురువారం మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు, సాగునీటి సంఘం మండలాధ్యక్షులు మాలేపాటి సుధాకర్‌నాయుడు, మండల యువనేత భానుచందర్‌నాయుడు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భాను మాట్లాడారు. భావితరాల మహనీయులను గుర్తి తెలియజేసేందుకు విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు వడ్డే వెంకటేశ్వర్లు, కంచర్లకృష్ణ, ముప్పాల సురేష్, పేపాలసూరి బాబు, పురిమెట్ల మనోహర్, పెంచలయ్య, అంకబాబు, రమణమ్మ, రాధయ్య తదితరులు ఉన్నారు.

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

బిట్రగుంట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీలోని రోడ్లు, కాలువలు అధ్వానంగా మారాయని, అందుకు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమే కారణం అని బోగోలు చెరువు నీటి సంఘం అధ్యక్షుడు మద్దిబోయిన వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ప్రధాన కాలువ చెత్తాచెదారంతో పూడుకు పోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తుందని మండిపడ్డారు. అలాగే కోదండరామాలయం వద్ద కాలువను శుభ్రం చేసి నెలలు గడు స్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు వాపోయారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జహీర్‌ని వివరాలు కోరగా సిబ్బందితో వెంటనే శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆక్స్‌ఫర్డ్‌లో ముందస్తు రంజాన్ వేడుకలు

కందుకూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్‌లో గురువారం ముందస్తు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మతపెద్ద మౌలానా రియాజ్ పాల్గొనగా ముస్లిం విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో హాజరై వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా వారిచే ప్రత్యేకంగా దువా చేయించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు స్వీట్లు, ఖర్జూరం, ఖీర్ పంచి పెట్టారు. విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాలభాస్కర్, నరేంద్రబాబు పాల్గొన్నారు.

క్రీడాకారుల అభివృద్ధికి సుబ్బారావు కృషి ఎనలేనిది

● సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

కందుకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల అభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయుడిగా తొట్టెంపూడి సుబ్బారావు చేసిన కృషి ఎనలేనిదని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీగా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న సుబ్బారావుకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, క్రీడాకారులు గురువారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా జిల్లా స్థాయిలో వివిధ క్రీడాపోటీలకు కందుకూరు టీఆర్ఆర్ కళాశాల వేదికగా మారడంతో పాటు జిల్లా స్థాయి జట్లకు శిక్షణ శిబిరాలు, జిల్లా జట్ల ఎంపికల కార్యక్రమాలు ఇక్కడే జరిగాయంటే దాని వెనుక పీడీ సుబ్బారావు కృషి ఎనలేనిదని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి పీడీ సుబ్బారావు దంపతులను ఘనం గా సత్కరించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్‌వలీ, టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్, వివిధ కళాశాలల అధ్యాపకులు, ప్రైవేటు కళాశాలల కరస్పాండెంట్లు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో వివిధ కళాశాలల్లో పని చేస్తు న్న వ్యాయామ ఉపాధ్యాయులు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయు లు పాల్గొని సుబ్బారావును సత్కరించారు.



తొట్టెంపూడి సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తదితరులు

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాల పర్యటన

వలేటివారిపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు శుక్రవారం నుంచి సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో పర్యటించను న్నాయి. ఈ తనిఖీ బృందాలు పంచాయతీల్లో ఏఏ పనులు చేపట్టారు, వాటికి బిల్లులు, చెల్లిం పులు వంటి వివరాలు, రికార్డులను పరిశీలించి అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేస్తారు. కాగా, నిష్పక్షపాతంగా తనిఖీలు చేపడితే భారీస్థాయిలో అక్రమాలు బయటపడ తాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

సిబ్బందిలో టెన్షన్ టెన్షన్

ఉపాధి హామీ పనులపై తనిఖీలు చేపట్టేందుకు సామాజిక తనిఖీ బృందాలు రావడంతో సిబ్బందిలో టెన్షన్ నెలకొంది. తాము చేసిన అవినీతిని బయటపెట్టకుండా ఉండేందుకు సామాజిక తనిఖీ బృందాలకు సపర్యలు చేస్తున్నారు. ఎక్కడ తమ అవినీతి బయటపడుతుందోనని రికార్డు లను సరిచేసుకునే పనిలో నిమగ్నమ య్యారు. సామాజిక తనిఖీ బృందంతో చర్చలు జరిపేందుకు కూడా వెనకాడట్లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమగ్ర వివరాలు నమోదు చేయాలి

కొండాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని విద్యార్థులందరి సమగ్ర వివ రాలను రికార్డులలో నమోదు చేయాలని ఎంఈవో-2 ఆనంద రావు తెలిపారు. గురువారం మండ లంలోని మర్రిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించి సూచనలిచ్చారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాహకులకు ఆదేశించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కార్యకర్తకు పలు సలహాలు ఇచ్చారు.

ఉపాధిహామీ పనులపై బహిరంగ విచారణ

దగదర్తి (బిట్రగుంట), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24లో జరిగిన మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై గురువారం మండల కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ గంగాభవానీ ఆధ్వర్యంలో అధికారులు బహిరంగ విచారణ చేపట్టారు. మండలంలోని 20పంచాయతీలకు సంబంధించిన పనుల్లో రూ.6.83లక్షల అవినీతి జరిగినట్లు గుర్తించారు. వీటిపై అధికారులు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ మృదుల, డీఈవో విజయలక్ష్మీ, అంబుడ్స్‌మేన్ వెంకటరెడ్డి, ఎస్‌టీఎం కోనయ్య, ఆవులయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ సర్పంచులు ఉన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

కందుకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 29వ తేదీన వాడవాడలా ఘనంగా నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు ప్రతిఒక్కరూ స్పందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని గ్రామాలు, కందుకూరు పట్టణ పరిధిలోని అన్ని వార్డులలో పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణలు నిర్వహించాలని కోరారు.

డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా రాజకుమార్ చౌదరి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కళాశాలల కరస్పాండెంట్లు

కావలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ప్రయివేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కావలి ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జీ.రాజకుమార్ చౌదరిని ఎన్నుకున్నారు. మంగళగిరిలోని వైష్ణవి కల్యాణ మండపంలో గురువారం జరిగిన రాష్ట్ర డిగ్రీ కళాశాలల కరస్పాండెట్ల సమావేశంలో 250 మంది పాల్గొనగా రాజకుమార్‌చౌదరిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజకుమార్ చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలోని కళాశాలల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి తనను ప్రధానకార్యదర్శిగా ఎన్నుకున్న కరస్పాండెంట్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గంగమ్మకు విశేష పూజలు



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు

ఉదయగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయంలో గురువారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు అమ్మవారికి పంచామృత, సుగంధ ద్రవ్యాలతో విశేష పూజలు, అలంకారాలు చేపట్టారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, జీఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, ఆలయ చైర్మన్ పాముల రమణయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి మాలకొండయ్య రూ.5 లక్షలు, రమణయ్య రూ.2 లక్షలు విరాళం అందజేయడంతో వారిని ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది.

భక్తిశ్రద్ధలతో షబే-బరాత్



విద్యుత్ దీపాలంకరణలో ఉదయగిరి పెద్ద మసీదు

ఉదయగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలో గురువారం షబే-బరాత్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి మసీదుల్లో జాగారం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

● అనంతసాగరం: మండలంలోని సోమశిల, అనంతసాగరం, కచ్చేరిదేవ రాయపల్లి, ఆమనిచిరివేళ్ల, ఉప్పలపాడు, ముస్తాపురం, గౌరవరం, పాతదేవరాయపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి షబే బరాత్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ పండుగ ప్రాముఖ్యతను మౌలానాలు వివరించారు.

167-బీ జాతీయ రహదారి నిర్మాణం పూర్తిచేయండి

● లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి గళం

ఉదయగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెట్ట ప్రాంత ప్రజలకు మణిహారమైన 167-బీ జాతీయ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, ఎప్పటికి పూర్తి చేస్తారో వివరాలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం లోక్‌సభలో తన గళాన్ని వినిపించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సీతారామపురం వద్ద ఏర్పాటు చేయనున్న బైపాస్‌ను ఎప్పటికి పూర్తి చేస్తారని ఆరా తీశారు. ఈ రహదారికి సంబంధించి ఇప్పటివరకు 70 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయని, ఎప్పటికి పూర్తి చేస్తారో వాస్తవ వివరాలు తెలియజేయాలని కోరారు. దీంతో స్పందించిన కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌జైరామ్‌గడ్కారీ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఏపీలోని ఎన్‌హెచ్-167బీ ఆధునికీకరణ, పునరావాసంలో భాగంగా సీతారామపురం బైపాస్ రోడ్డు మంజూరు చేయబడిందన్నారు. ఆగస్టు 2024 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఫిబ్రవరి 2023లో ప్రాజెక్టు ప్రారంభమైందన్నారు. బైపాస్ రహదారి కాంక్రీట్, గ్రామాల వద్ద నేమ్‌బోర్డుల ఏర్పాటు పనులు పూర్తి చేశామన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి దాదాపు 93 శాతం పనులు పూర్తయ్యాయని, మే 31 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త కొట్టే వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం తోటలచెరువుపల్లి, వరికుంటపాడు గ్రామాల్లోని ముస్లింలకు మండల కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాలను ఉన్నత స్థాయిలో నిలపాలన్న ఆశయంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పార్టీని స్థాపించారన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని స్వంత నగదుతో బియ్యం, నూనె, సేమియా, చక్కెర వంటి సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. అలాగే ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో సహా కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ రసూల్, జిల్లా కార్యదర్శి రవీంద్ర, నాయకులు కాకుమణి వెంకట్, గుమ్మలంపాటి వెంగళరావు, మారెళ్ల రజాక్, మానం నిఖిల్, దగ్గుపాటి రవి, సురేష్ పాల్గొన్నారు.



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

వడదెబ్బకు గురికాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలి

సంగం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎండల ప్రభావంతో వడదెబ్బకు గురికాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన స్థానిక వైద్యశాల ఆవరణలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు, అనారోగ్యంతో బాధపడేవారు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. తప్పని పరిస్థితుల్లో ఎండకు వెళ్లాల్సి వస్తే గొడుగు, తలకు టవల్ వినియోగించాలన్నారు. తగినన్ని నీళ్లు తాగాలన్నారు. ఉపాధి హామీ పనులు చేసేవారు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి

నేడు సొసైటీ మహాజన సభ

దుత్తలూరు(ఉదయగిరి): మండలంలోని కమ్మవారిపాళెం సొసైటీ మహాజన సభను శుక్రవారం నిర్వహించనున్నట్లు పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ సీఈవో లోకనాథ్ రెడ్డి గురువారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సభకు సొసైటీ సభ్యులందరూ హాజరు కావాలని వారు కోరారు.

పాఠశాలకు మైకు సెట్ వితరణ



మైక్ సెట్‌ను అందిస్తున్న పూర్వ విద్యార్థి శ్రీనివాసులు

ఏఎస్ పేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కావలిఎడవల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి నాగినేని శ్రీనివాసులు గురువారం మైక్‌సెట్, సౌండ్ బాక్సులు బహూకరించారు. ప్రస్తుతం వెంకటాచలం తహసీల్దారుగా పనిచేస్తున్న ఆయన తల్లి నాగినేని వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం వాటిని అందించారు. మరో నాలుగు రోజులలో క్రీడా పరికరాలను కూడా అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

సోమశిలలో 53.848 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి 53.848 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షి ణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

608 పొగాకు బేళ్ల కొనుగోలు

మర్రిపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డీసీ పల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 628 బేళ్లను తీసుకురాగా తొమ్మిది కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 608 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ. 280 కాగా, కనిష్ట ధర రూ. 255గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

ఉదయగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు గురువారం ఎంఈవో-2 శ్రీనివాసులు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలీమ్‌కో, సమగ్ర శిక్ష అభియాన్ వారు అందజేసిన హియరింగ్ మిషన్, వీల్‌చైర్‌లను భవిత కేంద్రంలోని శ్రావణ్ కుమార్, దీప్తిలకు అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణ, నరసింహ, ఎం రమణ, ఐఆర్పీలు సుభాష్‌చంద్రబోస్, శివనందిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

సీతారామపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి ఎస్‌కె మస్తాన్‌వలి సూచించారు. గురువారం మండల పరిధిలోని బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు, పండ్రంగి ప్రాథమిక పాఠశాలలో నలుగురు, సీతారామపురం కెజిబివిలో ఒక్కరు, ప్రాథమిక పాఠశాల స్పెషల్‌లో ఒక్కరిని మొత్తం 8 మంది విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బాలికల తల్లిదండ్రులు ఎక్కడికైనా వలస వెళ్ళినా దగ్గరలో ఉన్న కెజిబివిలో చేర్పిస్తే ఇంటర్మీడియట్ వరకు అన్ని వసతులతో కూడిన రెసిడెన్షియల్ విద్యను అందిస్తారని తెలిపారు.

తప్పయిపోయింది... క్షమించండి !

● మృతుడి తల్లిదండ్రులను వేడుకున్న కారు డ్రైవర్

వలేటివారిపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు - బడేవారిపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై ఈనెల 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో శింగమనేనిపల్లెకు చెందిన బాశం దినేష్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ప్రమాదానికి కారకులైన కారుడ్రైవర్ ఆయన సతీమణి మృతుని స్వగ్రామైన శింగమనేనిపల్లె గ్రామంలోని మృతుడు దినేష్ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు బాశం వెంకటేశ్వర్లు, సతీమణి మాధవిని కలిసి తప్పయిపోయింది.. తమను క్షమించాలని వేడుకున్నారు.

ఆ సచివాలయానికి మహిళా పోలీసే దిక్కు..!

● ఉద్యోగుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లి సచివాలయంలో పలు శాఖల ఉద్యోగులు నిరంతరం విధులకు ఎగనామం పెడుతున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం వివిధ పనులపై సచివాలయానికి వచ్చిన పలు గ్రామాల ప్రజలు గంటల తరబడి ఉద్యోగుల కోసం ఎదురుచూసి వెనుతిరగాల్సిన దుస్థితి నెలకొంది. ఫీల్డ్ పేరుతో రోజుల తరబడి కనీసం సచివాలయం వైపు కన్నెత్తి చూడకుండానే కాలం వెల్లబుచ్చుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో స్థానికంగా నివాసం ఉండే మహిళా పోలీసు మాత్రమే విధులకు హాజరవుతూ సచివాలయానికి దిక్కుగా మారుతుండడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోజుల తరబడి విధులకు ఎగనామం పెడుతున్న సచివాలయ ఉద్యోగులపై చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీసు